www.nagaranijam.com

PRGI/RNI NO : APTEL/2013/54450

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు :
☎ 82474 67562
Email Id : nagaranijam@gmail.com

# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక



| సంపుటి : 14 | సంచిక : 72 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 4,గురువారం,జూన్, 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 14 | Issue : 72 | Rangareddy | Editor : Aela.Purushotham | 4,Thursday,June,2026 | Pages : 4+ | Price : 3/- |

Published From Rangareddy, Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## తెలంగాణ దక్షిణాఫ్రికా మధ్య

# నైపుణ్య ఉద్యోగాలు, మెడికల్ టూరిజంపై సహకారం



హైదరాబాద్, 3 జూన్ (నగర నిజం) : తెలంగాణ రాష్ట్రం –దక్షిణాఫ్రికా మధ్య నైపుణ్య ఉద్యోగాలు, మెడికల్ టూరిజం, విద్యా మార్పిడి, పెట్టుబడుల రంగాల్లో పరస్పర సహకారానికి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. రెండు దేశాల మధ్య విద్య, వైద్య పర్యాటకం, పెట్టుబడుల రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లో ఉన్న విద్యా, నైపుణ్యాభివృద్ధి వ్యవస్థ దేశానికి జ్ఞాన కేంద్రంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఐటీ, ఫార్మా, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో ఇంజినీరింగ్ ప్రతిభకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మారిందన్నారు. ఫార్చ్యూన్–500 సంస్థల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల ఏర్పాటుకు హైదరాబాద్ ప్రముఖ గమ్యస్థానంగా నిలిచిందని వివరించారు. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండటంతో మధ్యప్రాచ్య దేశాలు సహా అనేక దేశాల ప్రజలు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు పొందేందుకు వస్తున్నారని తెలిపారు. నైపుణ్య ఉద్యోగాలు, మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. డిసెంబర్ 2026లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2026కు దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలు, వ్యాపార వేత్తలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఈ సమ్మిట్ ద్వారా రెండు దేశాల వ్యాపార రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచ ప్రమాణాలతో గ్రీన్ ఫీల్డ్ మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని కోరారు. మంత్రి సి. దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ హైదరాబాద్ భారీ స్థాయిలో బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్ల ఉత్పత్తికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. ప్రజల ఆరోగ్య అవసరాల కోసం మెగా ఆసుపత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు. దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే మాట్లాడుతూ భారత్–దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా భారత సంస్థలకు ఆఫ్రికా మార్కెట్లలో విస్తృత అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దక్షిణాఫ్రికాలో ఔషధ పరిశ్రమల స్థాపనకు కూడా అనుకూల వాతావరణం ఉందన్నారు. సమావేశంలో దక్షిణాఫ్రికా మంత్రులు, భారతదేశంలోని దక్షిణాఫ్రికా రాయబారి, తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.










# హయత్‌నగర్ తాపీ మేస్త్రి అసోసియేషన్ నూతన కార్యాలయం ప్రారంభం

# హయత్‌నగర్ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం కమిటీ సమావేశం

హయత్‌నగర్, 3, జూన్ (నగరనిజం) : హయత్ నగర్ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు కామల్ల అయిలన్న, బి. రామకృష్ణారెడ్డి, అంజనాద్రి నగర్ కాలనీ అధ్యక్షులు జే. సుధాకర్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సూర వెంకటయ్య, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి అదిరాల రవికుమార్, అత్తాపూర్ బి.ఎన్.ఆర్.కె.ఎస్ ఉపాధ్యక్షులు మల్ల గళ్ళ యాదన్న హాజరయ్యారు. అలాగే మునగనూరు కృష్ణ, అంబర్పేట్ అశోక్, నాగేశ్వరరావు, హుస్సేన్, సీతయ్య తదితర నాయకులు పాల్గొని నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగ కార్మికుల ఐక్యత ఎంతో ముఖ్యమని తెలిపారు. తాపీ మేస్త్రిల హక్కులు, సంక్షేమం కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హయత్ నగర్ భవన నిర్మాణ తాపీ మేస్త్రి అసోసియేషన్ అధ్యక్షులు ఇ.కాశయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కే. కొండల్, వి.కొండారెడ్డి, కోశాధికారి ఆర్. నాగిరెడ్డి, జనరల్ సెక్రటరీ కే. మాధవరెడ్డి, జాయింట్ సెక్రటరీ డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మేనేజర్లు వి. నాగేశ్వరరావు, కే.అంజయ్య, కే.అంకమ్మరావు, వెంకటేశ్వర్లు, కే.శ్రీహరి, కే.వీరయ్య, ప్రసాద్, వి.మహేందర్ రెడ్డి, శివయ్య, తిరుపతిరెడ్డి తదితర కమిటీ సభ్యులు, తాపీ మేస్త్రి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో కార్మికుల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ఈ నెల 8న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న తాపీ మేస్త్రిల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

### భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామల్ల అయిలన్న మాట్లాడుతూ...

జూన్ 8 తారీఖు నాడు ఇందిరా పార్క్‌లో జరిగేటువంటి తాపీ మేస్త్రీల ఆత్మగౌరవ సభను భవన నిర్మాణ రంగాల కార్మికులందరూ విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సెంట్రింగ్ మేస్త్రీలు మాట్లాడినటువంటి మాటలు వాపస్ తీసుకొని క్షమాపణ చెప్పకపోతే, రాబోయే కాలంలో తీవ్రమైనటువంటి పరిణామాలు ఉంటాయి. ఈ రంగంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్నటువంటి తాపీ మేస్త్రీని దళారి, మధ్యవర్తి, బ్రోకరు, తాపీ మేస్త్రీ హఠావో సెంట్రింగ్ బచావో అనేటువంటి నినాదాలు ఏదైతే ఉన్నాయో, అవి వెంటనే ఉపసంహరించుకొని సెంట్రింగ్ మేస్త్రీలు క్షమాపణ చెప్పాలి. లేని పక్షంలో తీవ్రమైనటువంటి పరిణామాలు ఉంటాయి. ఇవాళ తాపీ మేస్త్రీ లేకుండా పది రంగాలు కార్మికులు కలిసి భవన నిర్మాణం చేస్తేనే అద్భుతమైనటువంటి భవన నిర్మాణం అయితది. మరి ఇవాళ తాపీ మేస్త్రీయే పక్కకు పోతే ఒక వెన్నుపూస ఇరిగినట్టుగా ఉంటదనేది ఈ సందర్భంగా గుర్తుచేస్తు ఉన్నాను. సమాజానికి వెన్నుపూస ఎంత ముఖ్యమో ఇవాళ తాపీ మేస్త్రీ ఈ రంగంలో వెన్నుపూస లాంటోడు. మరి పక్కకు పోయిన తర్వాత వీళ్ళు ఎట్లా భవనాల్ని నిర్మాణం చేయగలుగుతారు? అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతా ఉన్నారు. అవన్నింటినీ ఉపసంహరించుకొని ఇవాళ తాపీ కార్మికులకు సహకరించి ఒక సోదర భావంతోని పోదాం అంటున్నాం. ఇవాళ ఈ అంతరాలు ఏర్పాటు చేసి కార్మికుల మధ్యలో చిచ్చు పెట్టేటువంటి ఈ దురహంకారమైనటువంటి బుద్ధిని మానుకోవాలి. ఇదంతా కూడా ఎవరు మాట్లాడుతారు? పెట్టుబడిదారీ మాట్లాడినటువంటి విధానం. ఒక భూస్వామ్య బడా పెట్టుబడిదారీ మాట్లాడేటువంటి విధానం. తోటి కార్మికుడు తోటి కార్మికుడిని కించపరిచేటువంటి విధానం ఇది సరైనటువంటి పద్ధతి కాదు. ఇవాళ సోదర భావంతోని కార్మికులను చూడాలి గానీ, వాళ్లను కించపరిచేటువంటి విధంగా మాట్లాడితే అది పద్ధతి కాదు కాబట్టి, అధ్యక్ష కార్యదర్శులు వెంటనే సెంట్రింగ్ సంఘానికి సంబంధించిన టువంటి అధ్యక్ష కార్యదర్శి క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా గుర్తుచేస్తూ, మరి ఎనిమిదో తారీఖు నాడు వేలాది మందిగా ఇందిరా పార్క్ కి తరలిరావాలని గుర్తుచేస్తాఉన్నాను .

**ప్రశ్న: ఎంతమంది వచ్చే అవకాశం ఉంది?**

సమాధానం: 20,000మంది రావడానికి అవకాశం ఉన్నది. అందరి కార్మికుల ఉత్సాహం చూస్తే చాలా... అంటే ఉత్సాహం కాదు గానీ ఒక ఆక్రోశం, ఆవేదన, ఆలోచన ఇవాళ మనోభావాలు దెబ్బతిన్నాయి. ఇవాళ తోటి కార్మికుడు కలిసి పనిచేస్తున్నోళ్లను ఈ రకంగా మాట్లాడటం, ఇది తీవ్రంగా ఖండిస్తా ఉన్నాం.

**ప్రశ్న: మీరు ఫస్ట్ సుందరయ్య విజ్ఞాన భవన్ అన్నారు కదా, ప్లేస్ మార్చడానికి గల కారణం?**

సమాధానం: సుందరయ్య భవన్ మార్చడానికి గల కారణం ఏందంటే మేము ఒక 1000 మందితోని అనుకున్నాం. కానీ ఇవాళ 20,000 మంది వస్తున్నారు కాబట్టి అది సరిపోదు కాబట్టి, అట్లా సుందరయ్య భవన్ నుంచి ఇందిరా పార్క్ కి మార్చడం జరిగింది.

**ప్రశ్న: ఎవరైనా మంత్రులు కానీ అట్లా ఎవరైనా వస్తున్నారా?**

సమాధానం: అన్ని రాజకీయ పార్టీ నాయకులను పిలవడం జరుగుతుంది. ఇది మా సంఘం రాజీ... రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి సంఘం. భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం. ఏ రాజకీయ పార్టీకి, ఏ వ్యక్తికి, ఏ శక్తికి అనుకూలమైనటువంటి సంస్థ కాదు. ఇండిపెండెంట్‌గా పది రంగాల కార్మికులను కలిపి పనిచేస్తున్నటువంటి సంస్థ బి.ఎన్.ఆర్.కె.ఎస్. అనేది ఈ సందర్భంగా గుర్తుచేస్తా ఉన్నా...

**ప్రశ్న: మీరు... వన్ వీక్ అయింది కదా పెట్టబట్టి, ఇప్పుడు వాళ్లెవరైనా మీకు సంప్రదింపులకు ఏమన్నా వచ్చారా?**

సమాధానం: అంటే వాళ్ళు సంప్రదించకుండా మా పనులెందుకు బంద్ చేస్తున్నావ్ అనేటువంటి పద్ధతిలో ఇంకా కార్మికులను రెచ్చగొట్టేటువంటి మాటలే మాట్లాడుతున్నారు గానీ, ఇది సోదర భావంతోని మాట్లాడేది... ఏదో జరిగిపోయింది అనేటువంటి పద్ధతి ఇంకా వాళ్లకు అర్థమైతలేదు. అర్థం కాదు మళ్ళీ పని ఎవరి దగ్గరికి వస్తుందంటే మల్లా తాపీ మేస్త్రీ దగ్గరికే వచ్చి పని ఎట్లా చేయాలి, ఆ ఎన్ని ఫీట్లు పెట్టి కొట్టాలని మళ్లీ తాపీ మేస్త్రీని అడుగుతున్నారు...

**ప్రశ్న: ఫైనల్‌గా ఏం చెప్పదలుచుకున్నారు వాళ్లకు?**

సమాధానం: వాళ్ళు తప్పకుండా వాళ్ళు క్షమాపణ చెప్పాలి. చెప్పేదాకా వదిలిపెట్టేది లేదు. ఎనిమిదో తారీకు తర్వాత ఇంకా పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. వాళ్లు ఒకవేళ క్షమాపణ చెప్పారంటే ఇంతటితోని దాన్ని ముగిస్తాం.

**ప్రశ్న: ఈ సభ కూడా పెట్టరా?**

సమాధానం: సభ పెడతాం కచ్చితంగా. ఆత్మగౌరవ సభ పెడతాం. ఒకవేళ వాళ్లు క్షమాపణ ఈ లోపు చెప్పిందంటే అది విజయోత్సవ సభ అయితుండొచ్చు.

**ప్రశ్న: అంటే ఇల్లు కట్టుకునే వారికి మీరు ఎలాంటి భరోసా ఇస్తున్నారు?**

సమాధానం: ఆ ఇల్లు కట్టేవాళ్లకు ఇవాళ వాళ్లు కార్మికులకు... తాపీ మేస్త్రీలను సంప్రదించకుండా వాళ్లు డిసైడ్ చేశారు రేట్లు. ఆ రేట్లు కూడా ఎట్లుండాలి? రీజనబుల్ గా ఉండాలి, అందరూ పని చేయించుకునే విధంగా ఉండాలి. ఇవాళ ఒక్కటే సారి 20 సంవత్సరాల రేట్లు పెరిగితే, సామాన్యులు ఎట్లా ఇల్లు కట్టుకోగలుగుతారు? కాబట్టి, రేట్లు తాపీ మేస్త్రీకి రేటు పెరిగితే సెంట్రింగ్ మేస్త్రీకి పెరుగుతాయి. కాబట్టి ఆ పెరిగేది కూడా ఒక రీజనబుల్ ఉంటే, మిగతా అన్ని సామాన్యుడు కట్టుకుంటాడు, ధనికుడు కట్టుకోవడానికి అవకాశం ఉంటది. కాబట్టి వాళ్లు పెట్టేటువంటి రేట్లు సరైనటువంటి పద్ధతి లేదు. ఒకవేళ సెంట్రింగ్ మేస్త్రీలు రేట్లు 51 రూపాయలని ఏదో ప్రకటన చేసుకుంటున్నారు. మరి వాళ్ల కింద పనిచేసే లేబర్ కి ఎంతిస్తున్నారు అని చెప్పాలి కదా? అది చెప్తలేరంటే అర్థమేంది? ఇది పెట్టుబడిదారీ ఆలోచన. శ్రామికుడిని కలుపుకపోయేటువంటి పద్ధతి కాదు, పెట్టుబడిదారీ ఆలోచనతోనే చేస్తున్నారు వాళ్లు. ఒక 1000 ఫీట్లు ఉండంగానే వాళ్లు చేతలు లేనటువంటి మాటలు మాట్లాడుతారు. ఆ 1000 ఫీట్ల సెంట్రింగ్ కూడా వాళ్ళు తెచ్చుకున్నది కాదు. తాపీ మేస్త్రీ ఇంటి ఓనర్ నుంచి డబ్బులు ఇప్పించి, వాళ్లకు చిన్నచిన్నగా డబ్బాలకు డబ్బులు ఇచ్చినటువంటి వ్యక్తి తాపీ మేస్త్రీ. అట్లాంటి వ్యక్తిని ఇవాళ వాళ్లుఏమని మాట్లాడుతున్నారు? బ్రోకర్లు, మధ్యవర్తులు. ఎందుకు బ్రోకర్లమైతాం? అంటే నీకు పని ఇవ్వడమా? ఒక ఇంటి ఓనర్ దగ్గరికి పోయి నువ్వు పని చెప్పి... తీసుకురాగలుగుతావా? నీకు ఇంటి ఓనర్ పని... నమ్ముతాడా? నమ్మేదల్లా తాపీ మేస్త్రీనే కదా. ఒకవేళ ఇంటి ఓనర్ నీకు డైరెక్ట్ పని ఇచ్చిండు అనుకుందాం. దారం కట్ట... కట్టగలుగుతావా? పెడెస్టల్ పెట్టగలుగుతావా? స్లాబ్ సాదగలుగుతావా? లేదా నువ్వు ముగ్గు పోయగలుగుతావా ఫస్ట్? తాపీ సుత్తె లేకుండా నువ్వు పని చేయగలుగుతావా? అదొక్కసారి చేసి చూయించమనండి. అప్పుడు తెలుస్తది వాళ్లకు ఏందనేది. పనితనము, పని విలువలు ఏందనేది వాళ్లు మాట్లాడే ఇంకా వెక్కిరిచేష్టలతోని, 100 రూపాయల గుండుదారం, 100 రూపాయల మనిషి, మాది 20 లక్షల పెట్టుబడి. 20 లక్షల పెట్టుబడి నువ్వు పెడుతున్నావ్ మేము కాదనట్లేదు, నీ గౌరవం నీకున్నది. నువ్వు 15 రోజులు పని చేస్తే, లక్ష రూపాయల బిల్లు అయితది. తాపీ మేస్త్రీ ఆరు నెలలు పని చేస్తే లక్ష రూపాయల బిల్లు కాదు. ఎవరికి ఎక్కువ వస్తున్నది? నీ ఆదాయం నీ పెట్టుబడి తీరుగా నీ ఆదాయం ఉన్నది. మా పెట్టుబడి మా శ్రమను బట్టి మాకు ఆదాయం ఉన్నది. కాబట్టి తాపీ కార్మికులను కించపరిచేటు వంటి పద్ధతి మానుకోవాలనేది మా డిమాండ్....



# తెల్లాపూర్‌లో ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు





- అనాథ ఆశ్రమ పిల్లల నడుమ కేక్ కట్ చేసి దుస్తులు, టిఫిన్ బాక్సుల పంపిణీ
- నేను చనిపోయినా నా అభివృద్ధి పనులు తెల్లాపూర్‌లో శాశ్వతంగా గుర్తుంటాయి: మాజీ సర్పంచ్ సోమిరెడ్డి
- ఇకపై కార్పొరేటర్‌గా పోటీ చేయను.. కొత్తవారికి అవకాశం ఇస్తా

**నగర నిజం ప్రతినిధి విజయ్ కుమార్ జూన్ 03 :**సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను తెల్లాపూర్ మాజీ సర్పంచ్ లలితా సోమిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అనాథ ఆశ్రమంలోని పిల్లల నడుమ కేక్ కట్ చేసి, వారికి నూతన వస్త్రాలు, టిఫిన్ బాక్సులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సోమిరెడ్డి మాట్లాడుతూ.. తమ రాజకీయ గురువు హరీష్ రావు జన్మదిన వేడుకలను అనాథ పిల్లల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆ పిల్లలు అనాథలు కారని, ఇప్పటి నుండి తన వంతు సహాయంగా వారికి ఎల్లప్పుడూ చేదోడు వాదోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. హరీష్ రావు రాజకీయ జీవితంలో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

### నేను లేకపోయినా నా జ్ఞాపకాలు సజీవం.

"నేను తెల్లాపూర్‌లో ఒక వార్డ్ మెంబర్‌గా, సర్పంచ్‌గా, మున్సిపల్ ఛైర్మన్‌గా పదవులు చేపట్టాను. భవిష్యత్తులో నేను చనిపోయిన తర్వాత కూడా నేను చేసిన అభివృద్ధి పనులే నన్ను బతికిస్తాయి. ఇక్కడి గ్రామపంచాయతీ భవనం, మున్సిపల్ కార్యాలయం, విశ్వకర్మ గుడి, తెల్లాపూర్‌శ్రీ లో చర్చి, బీరప్ప గుడి, ఇక్కడి రోడ్లను చూసిన ప్రతిసారీ ప్రజలకు సోమిరెడ్డి జ్ఞాపకాలు గుర్తొస్తాయి" అని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. హరీష్ రావు ఇచ్చిన సహకారంతోనే తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయము,కల్యాణ వేదిక లాంటి ఎన్నో మౌలిక వసతులు కల్పించగలిగామని వివరించారు.

### హరీష్ అన్న విజన్ వల్లే ఇక్కడ సర్కిల్ ఆఫీస్..

ఒక సందర్భంలో పటాన్‌చెరు కార్పొరేటర్, పటాన్‌చెరు మున్సిపల్ కార్యాలయాన్ని తెల్లాపూర్ సర్కిల్‌లో విలీనం చేశారని అధికారులను అడిగినప్పుడు.. ఇక్కడి తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎంతో విశాలంగా ఉందని, అందుకే కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగిస్తామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌కు అధికారులు స్పష్టం చేశారని సోమిరెడ్డి గుర్తుచేశారు. ఈ రోజు సర్కిల్ ఆఫీస్ తెల్లాపూర్‌లోనే ఉండటానికి కారణం నాడే హరీష్ అన్న చొరవతో ఇక్కడ ఇంత పెద్ద మున్సిపల్ కార్యాలయం నిర్మించడమేనని, ఆ ఘనత హరీష్ రావుదేనని కొనియాడారు.

### ఇకపై కార్పొరేటర్‌గా పోటీ చేయను..

తాను పదవుల కోసం ఆశపడే వ్యక్తిని కాదని సోమిరెడ్డి స్పష్టం చేశారు. ఇకపై రాజకీయంలో తాను కార్పొరేటర్‌గా పోటీ చేయనని, కొత్త వారికి అవకాశం కల్పించి, వారి వెన్నంటి ఉంటూ ఒక సాధారణ కార్యకర్తలా పనిచేస్తానని హామీ ఇచ్చారు. తాను మాట ఇస్తే తప్పని మనిషినని, గతంలో ఇచ్చిన మాట కోసం సర్పంచ్ పదవికి రాజీనామా చేసిన ఘనత తనదని, నాడు హరీష్ రావు రాజీనామా పత్రాన్ని వెనక్కి తీసుకోమన్నా.. ప్రజల కోసం వెనకడుగు వేయలేదని అన్నారు.

### ప్రతిపక్షాల వైఫల్యాలను ఎండగట్టిన సోమిరెడ్డి..

కొల్లూరు రాజకీయ వివాదం కారణంగా, స్పెషల్ ఆఫీసర్ల హయాంలో అభివృద్ధి కొరకు కేటాయించిన రూ. 6 కోట్ల నిధులను జిల్లా కలెక్టర్‌కు వదిలేసిన ఘనత ఇక్కడి ప్రతిపక్ష నాయకులదేనని ఎద్దేవా చేశారు. తాను ఏ పదవిలో లేనప్పుడు కూడా స్థానిక ఎంపీ సహాయంతో రెండు డ్వాక్రా మహిళా భవనాలు, 15 ఐమాక్స్ స్ట్రీట్ లైట్లు, ఆరు బోర్లు వేయించి ప్రజలకు అందుబాటులో ఉన్నానని తెలిపారు.

### ప్రశ్నించే గొంతు మాది.. అభివృద్ధి మీది!

కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాటలే తప్ప చేతలు లేవని సోమిరెడ్డి విమర్శించారు. "ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది, మేము ప్రతిపక్షంగా మిమ్మల్ని ప్రశ్నిస్తాం.. మీరు అభివృద్ధి చేసి చూపించండి. ప్రశ్నిస్తే అప్పటికప్పుడే ప్రెస్ మీట్లు పెట్టడం కాదు, ప్రజలకు ఏం చేశారో చెప్పాలి" అని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నాయకులు కేవలం వారి పార్టీ వారు బాగుంటే చాలని చూస్తారే తప్ప, ప్రజల గురించి పట్టించుకోరని మండిపడ్డారు. దేశాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టిన ఘనత బీజేపీ, కాంగ్రెస్ పార్టీలదేనని, దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణ నిధులను మళ్లించడమే వారి పని అని ఆరోపించారు.

### వచ్చే రెండేళ్లలో బీఆర్ఎస్ ఘనవిజయం ఖాయం..

బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా ఉండాలని, వచ్చే రెండేళ్లలో పార్టీ ఘనవిజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా ఫలితం ఉంటుందన్నారు. కేసీఆర్ ఉద్యమం చేసి తెలంగాణ తెచ్చారు కాబట్టే.. తెలంగాణపై కేసీఆర్‌కు, హరీష్ రావుకు, ఇక్కడి ప్రజలకు మరియు ఇక్కడ స్థిరపడిన ఆంధ్రప్రదేశ్ వాసులకు కూడా ప్రత్యేకమైన ప్రేమ ఉంటుందని సోమిరెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు , బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు మరియు ఆశ్రమ సిబ్బంది, పిల్లలు పాల్గొని హరీష్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.







## భారతి నగర్ లో డ్రైనేజీ సమస్యల పరిశీలన



- తక్షణ చర్యలకు అధికారుల హామీ

నగర నిజం జూన్ 3 సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని భారతి నగర్ మరియు రామచంద్రాపురం డివిజన్లలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ పర్యటనలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వి. ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు.రామచంద్రాపురం మెయిన్ రోడ్, ఫెన్సింగ్ ఏరియా, బొంబాయి కాలనీలలో ఉన్న డ్రైనేజీ సమస్యలను అధికారులు పరిశీలించారు. ప్రధానంగా ఎల్ఐజీ కాలనీలో తాగునీటి పైపులైన్లలో డ్రైనేజీ నీరు కలుస్తున్న సమస్యను గుర్తించి, దీనిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఈడీ ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే, భారతి నగర్ డివిజన్ వినియోగం కోసం ప్రత్యేకంగా ఒక కొత్త గల్ఫర్ మెషీన్‌ను కేటాయించినట్లు తెలిపారు.స్థానిక సమస్యలను ప్రజాప్రతినిధులు, పార్టీ ఇంచార్జ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జీఎం శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం శివ, నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.




### రామచంద్రపురంలో ఘనంగా హరీశ్‌రావు జన్మదిన వేడుకలు





**నగర నిజం జూన్ 03** సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం:సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలు రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు సర్కిల్ అధ్యక్షులు పరమేశ్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.అనంతరం అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేసి పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మద్దూరి శ్రీకాంత్ రెడ్డి, నర్సింహ, కావాలి శ్రీరాముల, బల్ల నర్సింగ్ రావు, క్రాంతి, జైపాల్, గడ్డం కుమార్, రాములు యాదవ్, అప్పల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి నూతన వస్త్రాలంకరణ వేడుకలో సందడి చేసిన ఎన్నారం రాజు స్నేహితులు





**కుత్బుల్లాపూర్, 3 జూన్ (నగర నిజం ప్రతినిధి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రాంతంలో చిన్నారి నూతన వస్త్రాలంకరణ వేడుకను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం ఆనందోత్సాహాల నడుమ ఎంతో వైభవంగా సాగింది.చిన్నారి తల్లిదండ్రులు రాజు సుమిత దంపతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ వేడుకకు ప్రాంతీయ ప్రముఖులు, పెద్దలు, స్నేహితులు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. చిన్నారి భవిష్యత్తు ఆరోగ్యంగా, ఆనందంగా, విద్యా విజయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు.కార్యక్రమ ప్రాంగణాన్ని అందంగా అలంకరించగా, వేడుకకు విచ్చేసిన అతిథులను కుటుంబ సభ్యులు ఆత్మీయంగా ఆహ్వానించారు. ఎన్నారం రాజు స్నేహితులు కలిసి కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించడంతో వేడుక మరింత ఆకర్షణీయంగా నిలిచింది. సాంప్రదాయ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.అంతేకాకుండా, చిన్నారికి నూతన వస్త్రాలు తొడిగించి ప్రత్యేక ఆశీర్వాదాలు అందించగా, కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు కుటుంబ సభ్యులను అభినందించారు. పరస్పర ఆప్యాయతలు, స్నేహబంధాలను ప్రతిబింబించేలా జరిగిన ఈ వేడుక స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

22

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

- తుర్కగూడ సర్పంచ్ ఏనుగు నరేందర్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, జూన్ 3 ( నగరనిజం ) :** అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని సర్పంచ్ ఏనుగు నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ గ్రామంలో సామల అమరావతి నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను గ్రామ సర్పంచ్ ఏనుగు నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లను వేగవంతం చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేసుకొని గృహ ప్రవేశాల్లో నివసించాలని కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కాగా ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులు తమ నూతన గృహాల్లో ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సిరిసంపదలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం సామల అమరావతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగు వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు మద్దెల శ్రీకాంత్, మద్దెల జలంధర్, దే రంగుల శ్రీనివాస్, మంద పవన్ కుమార్, మంద పుష్పలత, ఏనుగు మంగమ్మ, వరికుప్పల కల్పన, గ్రామపంచాయతీ కార్యదర్శి మనీషా, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫాం తోటకు నిప్పు.. 60 చెట్లు దగ్ధం



**రాయికల్ జూన్ 03 (నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ మండల పరిధిలోని వాటర్ బిడ్డు సమీపంలో మొసరపు రాజేష్ గౌడ్‌కు చెందిన ఆయిల్ ఫాం తోటలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలో సుమారు 60 ఆయిల్ ఫాం చెట్లు పూర్తిగా అగ్నికి ఆహుతై రైతుకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది.మంటలను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. జగిత్యాల నుంచి ఫైర్ ఇంజన్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేలోపే చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై రైతు మొసరపు రాజేష్ గౌడ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.రాయికల్‌లో అగ్నిమాపక కేంద్రం ఉండి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదని, జగిత్యాల నుంచి ఫైర్ ఇంజన్ ఆలస్యంగా రావడం వల్ల 60 ఆయిల్ ఫాం చెట్లు కాలిపోయాయని ఆయన పేర్కొన్నారు. రాయికల్‌లో శాశ్వత ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని రైతులు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## నూతన్ కల్ అంగన్వాడీల్లో సిబ్బంది కరువు..

● డి.డబ్ల్యు.ఓ అధికారి కి ఫిర్యాదు చేసిన కౌన్సిలర్ సద్ది సురేష్ రెడ్డి



**మేడ్చల్ జూన్ 3 (నగర నిజం):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని నూతన్ కల్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. సిబ్బంది కొరతతో అంగన్వాడీ కేంద్రాలు మూతపడుతుండటంతో గర్భిణులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 16వ వార్డు కౌన్సిలర్ సద్ది సురేష్ కుమార్ రెడ్డి డి.డబ్ల్యు.ఓ కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నూతనకల్ గ్రామ పరిధిలో మొత్తం రెండు (2) అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. అయితే, ఇందులో ఒక కేంద్రంలో టీచర్ లేకపోవడంతో ఆ కేంద్రాన్ని పూర్తిగా మూసివేశారు.

### ఇన్‌చార్జ్ టీచర్‌తో అవస్థలు

రెండవ కేంద్రానికి కూడా పూర్తిస్థాయి టీచర్ లేకపోవడంతో, పక్క గ్రామానికి చెందిన ఒక ఇన్‌చార్జ్ టీచర్‌తో నెట్టుకొస్తున్నారు. ఈ కేంద్రాల్లో పిల్లలను చూసుకోవడానికి కనీసం 'ఆయా'లు కూడా లేకపోవడం గమనార్హం.

### పౌష్టికాహార పంపిణీకి ఆటంకం:

సుమారు 4 వేల పైచిలుకు జనాభా ఉన్న నూతనకల్ గ్రామంలో అంగన్వాడీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో గర్భిణీ మహిళలకు, చిన్న పిల్లలకు అందాల్సిన పౌష్టికాహార పంపిణీకి తీవ్ర ఆటంకం కలుగుతోందని కౌన్సిలర్ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు.

### ఆశా వర్కర్ల కొరత:

అంగన్వాడీ సమస్యలే కాకుండా, నూతనకల్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఆశా వర్కర్ల కొరత కూడా వేధిస్తోందని కౌన్సిలర్ సురేష్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఐదు (5) ఆశా వర్కర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన్ కల్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలకు వెంటనే పూర్తిస్థాయిలో టీచర్లను, ఆయా లను నియమించాలని, అలాగే ఆశా వర్కర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కౌన్సిలర్ సద్ది సురేష్ రెడ్డి చిన్నోళ్ల భాస్కర్ డి.డబ్ల్యు.ఓ అధికారిని కోరారు.

## మాజీ మంత్రి హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నేత మాణిక్ యాదవ్



**నగర నిజం జూన్ 03** సంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ నేత ఐలాపూర్ మాణిక్ యాదవ్.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హరీష్ రావు నివాసానికి వెళ్లిన మాణిక్ యాదవ్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాణిక్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధికి, రైతాంగ సంక్షేమానికి, ప్రజా సేవకు హరీష్‌రావు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయన కోట్లాది మంది అభిమానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించి, మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పార్టీ నాయకులు బాల్ రెడ్డి, సోమిరెడ్డి, తొంట అంజయ్య యాదవ్, జగన్నాథ్ రెడ్డి, శివ, ఆనంద్, సత్యనారాయణ తదితర బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు





● పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ వి. ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్

● పాల్గొన్న మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు

**నగర నిజం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, జూన్ 03** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, తన్నీరు హరీష్ రావు జన్మదినోత్సవ వేడుకలు నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి నివాసంలో హరీష్ రావు జన్మదిన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదర్శ్ రెడ్డి కేక్ కట్ చేసి, హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వి. ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ కాలం నుండి నేటి వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన గొప్ప ప్రజా నాయకుడు హరీష్ రావు అని కొనియాడారు. మాజీ మంత్రిగా రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పోషించిన పాత్ర అత్యంత కీలకమైందని గుర్తుచేశారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తపించే ఆయన, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన



మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, పరమేష్ యాదవ్, వివిధ డివిజన్ల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీ.ఆర్.పి ఇన్స్పెక్టర్ ఆరెళ్ళ శ్రీనివాస్ కు మహోన్నత సేవా పథకం

● 33 ఏళ్లుగా పోలీసు శాఖలో సేవలందిస్తున్న ఆరెళ్ళ శ్రీనివాస్

● శంషాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస్ విద్యాభ్యాసం

● ప్రస్తుతం సికింద్రాబాద్ లో జీ.ఆర్.పీ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఆరెళ్ళ శ్రీనివాస్



**రాజేంద్రనగర్, జూన్ 3 (నగరనిజం ప్రతినిధి):** రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన జీ.ఆర్.పి ఇన్స్పెక్టర్ ఆరెళ్ళ శ్రీనివాస్ మహోన్నత సేవా పథకానికి ఎంపికయ్యారు. గడిచిన 33 ఏళ్లుగా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆరెళ్ళ శ్రీనివాస్.... ప్రజలకు అందించిన సేవలకు గాను ప్రభుత్వం ఆయనను మహోన్నత సేవా పథకానికి ఎంపిక చేసింది. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఈ మేరకు ఆరెళ్ళ శ్రీనివాస్ కు రాష్ట్ర ప్రభుత్వం మహోన్నత పురస్కారాన్ని ప్రకటించింది. రంగారెడ్డి జిల్లా లోని రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ఆరెళ్ళ శ్రీనివాస్ శంషాబాద్ లోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో 1986 లో పదో తరగతి విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో 1993 లో ఆరెళ్ళ శ్రీనివాస్ కానిస్టేబుల్ గా పోలీసు శాఖలో అడుగు పెట్టాడు. ఐదేళ్లపాటు కానిస్టేబుల్ గా, హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తించిన ఆయన కు 1998 లో హైదరాబాద్ రేంజ్ లో ఆర్.ఎస్.ఐ గా పదోన్నతి లభించింది. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ అధికారుల చేత ప్రశంసలు అందుకున్న ఆరెళ్ళ శ్రీనివాస్.... 2017 లో ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఆయన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో జీ.ఆర్.పీ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో కానిస్టేబుల్ గా పోలీసు శాఖలో చేరిన ఆరెళ్ళ శ్రీనివాస్....గడిచిన 33 ఏళ్లుగా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో ప్రజలకు విశిష్టమైన సేవలు అందిస్తున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకొని పోలీసులకు సేవా పథకాలు ప్రకటించింది. ఈ మేరకు సికింద్రాబాద్ లో జి.ఆర్.పి ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఆరెళ్ళ శ్రీనివాస్ కు ప్రభుత్వం మహోన్నత సేవా పథకాన్ని ప్రకటించింది. మహోన్నత సేవా పథకానికి ఎంపికైన ఆరెళ్ళ శ్రీనివాస్ కు పలువురు పోలీసు అధికారులతో పాటు పలువురు నేతలు అభినందనలు తెలిపారు. పోలీసు శాఖలో 33 ఏళ్లుగా విశిష్ట సేవలు అందించినందుకు గాను ప్రభుత్వం ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందజేయడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

# నైపుణ్యాభివృద్ధికి గీతం పెద్దపీట

● అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో విద్యార్థులకు మార్గనిర్దేశం

**నగర నిజం జూన్ 03** సంగారెడ్డి వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో విద్యార్థులకు స్పష్టత, దిశానిర్దేశం అందించే లక్ష్యంతో, గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్, శిక్షణ, మార్గదర్శనం, వృత్తిపరమైన సలహాలు (టీఎంసీజీ) డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులు పరిశ్రమకు సంబంధించిన నైపుణ్యాలను, కెరీర్ మార్గాలను నిర్మించుకోవడంలో సహాయపడటానికి రూపొందించిన సమగ్ర కెరీర్ మార్గ సూచీల శ్రేణిని ప్రవేశపెట్టారు. నేటి విద్యార్థులకు అపారమైన ఆశయాలు ఉన్నప్పటికీ, అభివృద్ధి చెందుతున్న అనేక రంగాలలో సరైన వృత్తి మార్గాన్ని ఎంచుకోవడంలో వారు తరచుగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని టీఎంసీజీ నిపుణులు గుర్తించారు. దానిని అధిగమించేలా, ప్రాథమిక అభ్యాసం నుంచి పరిశ్రమకు సిద్ధమయ్యే వరకు విద్యార్థుల ప్రయాణాన్ని సులభతరం చేసే నిర్మాణాత్మక అభ్యాస మార్గాలను వారు అభివృద్ధి చేశారు. కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్ వేర్ ఇంజనీరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, బ్లాక్ చెయిన్, వీఎల్ఎస్ఐ వంటి మరెన్నో సాంకేతికతలు అభివృద్ధి చెందడంతో, విద్యార్థులు తమ వృత్తి ప్రయాణాన్ని ఎక్కడ, ఎలా ప్రారంభించాలో గుర్తించడంలో తరచుగా తడబడుతున్నారు. ఈ అవసరాన్ని తీరుస్తూ, కొత్తగా ప్రారంభించిన మార్గ సూచీలు వృత్తి నిపుణులు కావాలనుకునే వారికి స్పష్టమైన, ఆచరణాత్మకమైక అభ్యాస మార్గాన్ని అందిస్తున్నాయి. సాంకేతికేతర కెరీర్ రంగాలతో సహా, మరిన్ని అదనపు మార్గ సూచీలు కూడా ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్నాయి. ఈ కార్యక్రమం గురించి డాక్టర్ రోజీనా మాథ్యూ మాట్లాడుతూ, టెక్నాలజీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, వృత్తిపరమైన విజయానికి నిరంతర అభ్యాసం అత్యవసరమని స్పష్టీకరించారు. తాము రూపొందించిన మార్గదర్శకాలు విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, ఒక లక్ష్యంతో, నిర్మాణాత్మక మార్గదర్శనంతో అభివృద్ధి చెందుతున్న రంగాలను అన్వేషించంలో సహాయపడటానికి ఉద్దేశించినట్టు తెలియజేశారు. 'ఏమి నేర్చుకోవాలి, ఎప్పుడు నేర్చుకోవాలి, ప్రాథమిక స్థాయి భావనల నుంచి పరిశ్రమకు సిద్ధంగా ఉన్న నిపుణులుగా ఎలా ఎదగాలి అనే

GITAM
DEEMED TO BE UNIVERSITY

విషయాలను విద్యార్థులు అర్థం చేసుకోవడంలో సహాయపడటానికి ఈ మార్గ సూచీలను రూపొందించాం. ఒక విద్యార్థి ఒక రంగాన్ని మొదటిసారి అన్వేషిస్తున్నా లేదా నైపుణ్యాలను పెంచుకునే తదుపరి దశకు ప్రణాళిక వేస్తున్నా, ఈ వనరులు ఒక విలువైన ప్రారంభ బిందువుగా ఉపయోగపడతాయి' అని డాక్టర్ రోజీనా వివరించారు. పరిశ్రమ పోకడలు, సాంకేతిక పురోగతులకు అనుగుణంగా నిరంతరం అధునాతనను సంతరించుకునే సజీవ పత్రాలుగా ఈ మార్గ సూచీలను రూపొందించారు. భవిష్యత్ అభ్యాసకులకు ఈ వనరులు ప్రయోజనకరంగా ఉండేలా చూసేందుకు, లేదా మెరుగుదల కోసం సూచనలు తెలియజేయమని విద్యార్థులను అధ్యాపకులు ప్రోత్సహిస్తున్నారు. నైపుణ్యాభివృద్ధి దిశగా చురుకైన చర్యలు తీసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహిస్తూ, 'ప్రారంభించడానికి ఉత్తమ సమయం నిన్న. రెండవ ఉత్తమ సమయం ఇప్పుడే' అని వారు ప్రేరేపిస్తున్నారు. విద్యార్థులకు ఆచరణాత్మక మార్గదర్శనం, మెంటార్ షిప్, క్రమబద్ధమైన కెరీర్ అభివృద్ధి వనరులను అందించడం ద్వారా, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నిపుణులను తీర్చిదిద్దడంలో గీతం యొక్క నిరంతర నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తోంది. అన్వేషించండి, నేర్చుకోండి, నిర్మించండి, ఎదగండి' అనేది ఈ పరివర్తనాత్మక కార్యక్రమానికి మార్గదర్శక సందేశంగా ఈ వినూత్న కార్యక్రమం నిలుస్తుంది.

# కేంద్రం కొత్త యాప్: పైలట్ ప్రాజెక్టుగా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలు



● మేడ్చల్ మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి

**మేడ్చల్, జూన్ 2 (నగర నిజం):** రైతులకు ఎరువుల కొనుగోలు ప్రక్రియను మరింత సులభతరం, పారదర్శకం చేసేందుకు భారత ప్రభుత్వం ఒక సరికొత్త మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నూతన విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు పైలట్ ప్రాజెక్ట్ కింద తెలంగాణలోని మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు మేడ్చల్ మండల వ్యవసాయ అధికారి ఒక




ప్రకటన విడుదల చేశారు.

### యాప్ ద్వారానే ఎరువుల బుకింగ్

ఈ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం Framework for Fertilizer Saleఅనే యాప్‌ను రూపొందించింది. రైతులు ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇకపై రైతులు యూరియా కాకుండా, మిగిలిన అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులు, పొటాష్, డి.ఎ.పి,ఎమ్.ఓ.పి వంటి అన్ని రకాల ఎరువులను ఈ యాప్ ద్వారానే ముందస్తుగా బుకింగ్ చేసుకుని కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

### సందేహాల నివృత్తికి అధికారుల గుర్తింపు

ఈ కొత్త యాప్ వినియోగంపై గానీ, ఎరువుల బుకింగ్ విధానంపై గానీ రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రైతులు తమ పరిధిలోని సంబంధిత వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని మేడ్చల్ మండల వ్యవసాయాధికారి మాధవరెడ్డి, పత్రిక ప్రకటనలో తెలిపారు.

# జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి మరో మైలురాయి





- హత్నూర మండలం బోరపట్ల శివారులో తెరానిమ్ బయోలాజిక్స్ యూనిట్‌ను ప్రారంభించిన మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ

**నగర నిజం సంగారెడ్డి, జూన్ 3:**తెరానిమ్ బయోలాజిక్స్ యూనిట్ ప్రారంభం ద్వారా తెలంగాణ బయోఫార్మా రంగంలో మరో కీలక ముందడుగు పడిందని, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఇది నూతన ఊతాన్ని అందిస్తుందని మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోరపట్ల శివారులో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన తెరానిమ్ బయోలాజిక్స్ తయారీ యూనిట్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, పారదర్శక విధానాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉండటంతో ప్రపంచ స్థాయి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు.బయోటెక్నాలజీ, ఔషధ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే దేశంలో అగ్రగామిగా నిలిచిందని, ఔషధ రంగంలో ఆధునిక సాంకేతికతతో కూడిన తెరానిమ్ బయోలాజిక్స్ వంటి సంస్థల రాకతో రాష్ట్రం అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు పొందుతుందని పేర్కొన్నారు. ఈ సంస్థ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని అన్నారు.మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ అత్యాధునిక బయోలాజికల్ ఔషధాల తయారీలో ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు ఇలాంటి సంస్థలు బలాన్ని చేకూరుస్తాయని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా ఔషధ, బయోటెక్నాలజీ రంగాలకు ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, పరిశ్రమల విస్తరణతో పాటు స్థానిక ప్రజల జీవనోపాధి అవకాశాలు కూడా గణనీయంగా మెరుగుపడతాయని తెలిపారు. పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని సంస్థలకు సూచించారు.ఈ కార్యక్రమంలో టి జి ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు,జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ కలెక్టర్ పాండు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# స్పోర్ట్స్ ఆఫ్ అథారిటీ ఆఫ్ ఇండియా కి ఎంపికైన విద్యార్థిని...





- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో...
- గత మూడు దశాబ్దాలలో ఇదే మొదటిసారి..
- పలువురు ప్రముఖుల అభినందనలు..
- ఘనంగా సన్మానించిన మంత్రి అడ్లూరీ లక్ష్మణ్ కుమార్..
- మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన విస్డం పాఠశాల యజమాన్యం..

**రాయికల్ జూన్ 03 (నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రానికి చెందిన విస్డం పాఠశాల లో చదువుతున్న చిదుమల్ల సాన్విక అనే విద్యార్థిని హైదరాబాద్ గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ ఆఫ్ అథారిటీ ఆఫ్ ఇండియా (క్రీడా పాఠశాల) కు ఎంపికైంది.. గత మూడు దశాబ్దాల కాలంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఇదే మొదటిసారి కావడం గమనార్హం... ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరీంనగర్ జగిత్యాల లాంటి పట్టణాలలో అన్ని రకాల వసతులు ఉన్నా కూడా గత మూడు దశాబ్దాల కాలంలో ఏ పాఠశాల విద్యార్థి కూడా ఈ ఎంపిక కాలేకపోవడం ఒకింత బాధ కలిగించే విషయం.. కానీ సాన్విక ఈ ఘనత సాధించడం పట్ల విస్డం పాఠశాల కరస్పాండెంట్ రాజిరెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాల నుంచి విద్యార్థులను క్రీడారంగంలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన విధంగా శిక్షణ ఇస్తున్నామని. ఈరోజు అందుకు తగిన ప్రతిఫలం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. సాన్విక మొదటి నుండి క్రీడలలో చురుకుగా పాల్గొంటుందని అది గుర్తించి ఆమెపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి శిక్షణ ఇచ్చామని ఆమెకే కాకుండా పాఠశాలలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి క్రీడలలోని ప్రాథమిక అంశాల నుండి వారి లోపాలను సరిదిద్దుతూ శిక్షణ కొనసాగుతుందన్నారు.చదువులలో విద్యార్థులు రాణించాలంటే వారు క్రీడల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలి.మేము చదువుతో పాటు క్రీడలపై కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తాం.. క్రీడల ద్వారా శారీరక మరియు మానసిక ప్రశాంతత నెలకొంటుంది.. ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు ముందుకు సాగుతారు..కేవలం క్రీడలనే కాకుండా విద్యార్థులు ఏ ఏ రంగాలలో తమ నైపుణ్యాన్ని చూపిస్తారో వాటిలో వారికి శిక్షణ ఇస్తాం అన్నారు.మంత్రి చేతుల మీదుగా సన్మానం అందుకోవడం ఆనందంగా ఉంది...ఇలా ఉండగా గత మూడు దశాబ్దాల కాలంలో మొదటిసారిగా క్రీడా పాఠశాలకు ఎంపికైన తమ పాఠశాల విద్యార్థిని సాన్వికను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ సన్మానించడం పట్ల విస్డం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఏ.ఎమ్ .రాజు రెడ్డి మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.


# హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు నాగేందర్ గౌడ్, అత్తాపూర్ గ్రామ కంటెస్టెడ్ సర్పంచ్ నల్లోల యాదగిరి

**కుత్బుల్లాపూర్, 3 జూన్ (నగర నిజం ప్రతినిధి):** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగేందర్ గౌడ్ మరియు అత్తాపూర్ గ్రామ కంటెస్టెడ్ సర్పంచ్ నల్లోల యాదగిరి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, హరీష్ రావు దీర్ఘాయుష్షుతో, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ, రాష్ట్ర అభివృద్ధిలోనూ హరీష్ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల



సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా హరీష్ రావు ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. రైతులు, విద్యార్థులు, యువత, మహిళల సంక్షేమం కోసం ఆయన తీసుకున్న పలు కార్యక్రమాలు ప్రజల మన్ననలు పొందాయని తెలిపారు.అలాగే బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి హరీష్ రావు నిరంతరం కృషి చేస్తున్నారని, పార్టీ కార్యకర్తలకు ఆయన ఎల్లప్పుడూ మార్గదర్శకుడిగా నిలుస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేసి బీఆర్ఎస్ పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి ఆలయంలో ఘనంగా సంకష్టహర చతుర్దశి పూజలు




**నగర నిజం జూన్ 3:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని ఇస్నాపూర్ మున్సిపాలిటీలో గల ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవస్థానంలో సంకష్టహర చతుర్దశిని పురస్కరించుకొని బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చీత్యంత శ్రీక్షఖ్విశ్కద్ధలతో నిర్వహించారు.ఉదయం నుంచే ఆలయంలో పండగ వాతావరణం నెలకొంది. సంకష్టహర చతుర్దశి సందర్భంగా ఆలయ అర్చకులు సిద్ధి గణపతి స్వామివారికి శాస్త్రోక్తంగా విశేష పంచామృతా భిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సింధూర వర్ణంతో నయనమ నోహరంగా అలంకరించారు. ఈ రూపంలో దర్శనమిచ్చిన సిద్ధి గణపతిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.మధ్యాహ్నం భక్తులందరికీ నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.సాయంత్రం వేళ ఆలయ ప్రాంగణంలో భక్తులచే శ్రీ గణపతి వ్రతం, అనంతరం భజన సంకీర్తనలు వైభవంగా జరిగాయి. ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బందితో పాటు స్థానిక గ్రామ పెద్దలు, భక్తులు, నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# అల్లిపూర్‌లో ఘనంగా 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' గ్రామ సభ



**రాయికల్ జూన్ 03 (నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట గ్రామ సభను బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోరండ్ల కిరణ్, గ్రామ సర్పంచ్ ఎంబరి గౌతమి-వెంకటేష్, ఉప సర్పంచ్ వినయ్ కుమార్, గ్రామ కార్యదర్శి శేఖర్, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి విద్య ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సభలో ప్రధానోపాధ్యాయులు పోరండ్ల కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, డిజిటల్ తరగతులు, ఆధునిక వసతులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.సర్పంచ్ ఎంబరి గౌతమి-వెంకటేష్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి చిన్నారి విద్యను అభ్యసించాలన్నదే లక్ష్యమని అన్నారు. ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీల నుంచి పాఠశాలల్లో చేర్పించాలని, బడి వయసు పిల్లలు చదువుకు దూరం కాకుండా చూడాలని సూచించారు.అనంతరం ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం తదితర సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోపీనాథ్ ముండేకు భారతరత్న ప్రకటించాలని వంజరి సంఘాల డిమాండ్


**హైదరాబాద్, జూన్ 3:** దేశంలోని బడుగు, బలహీన వర్గాల రాజకీయ సాధికారత కోసం విశేషంగా కృషి చేసిన ప్రముఖ నేత, స్వర్గీయ గోపినాథ్ ముండే కు



భారతరత్న పురస్కారం ప్రకటించాలని అఖిల భారత వంజరి సేవా సంఘం, తెలంగాణ వంజరి సేవా సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. అలాగే ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశాయి.గోపీనాథ్ ముండే 13వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లో వంజరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, దేశంలోని బడుగు వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు, వారికి ప్రత్యామ్నాయ జాతీయ రాజకీయ వేదికను అందించేందుకు గోపీనాథ్ ముండే నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు.జాతీయవాద రాజకీయాల్లో వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అందువల్ల భారతరత్నకు అన్ని విధాలా అర్హులని అన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలోనే మరణించిన గోపీనాథ్ ముండే సేవలను గుర్తించి, ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాలను కోరారు.తెలంగాణ రాష్ట్రానికి గోపీనాథ్ ముండే వంటి ప్రజానాయకుల అవసరం ఎంతో ఉందని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత వంజరి సేవా సంఘం నాయకులు సాల్వేరు కృష్ణ, ఎదుగని శంకర్, ఎదుగని హరినాథ్, కాలేరు సురేష్, ధాత్రిక కాశీనాథ్, కాలేరు యుగంధర్, రిటైర్డ్ డీఎస్పీ శివప్రసాద్, రత్నం సంతోష్ ఆముద లక్ష్మణ్, మహదేవ్ ముండే, కాలేరు సాయిబాబా, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

## బిజెపి నాయకుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్



**కుత్బుల్లాపూర్, 3 జూన్ (నగర నిజం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రంపై బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ చేసిన వ్యాఖ్యలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ తీవ్రంగా ఖండించారు. తెలంగాణ పోరాట యోధుల కలలు ఇంకా నెరవేరలేదని బిజెపి నాయకులు మాట్లాడటం చరిత్రను వక్రీకరించడమేనని ఆయన విమర్శించారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ప్రజలు ఎన్నో త్యాగాలు చేశారని, ఆ సమయంలో బిజెపి పార్టీ తెలంగాణకు మద్దతుగా నిలవలేదని ఆయన పేర్కొన్నారు. 1997లో కాకినాడలో చేసిన "ఒక ఓటు – రెండు రాష్ట్రాలు" తీర్మానం ప్రకారం అప్పుడే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి ఉంటే అనేక మంది ఉద్యమకారులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఏర్పాటు చేసిన సమయంలో తెలంగాణకు ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో బిజెపి ఎప్పటికప్పుడు ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని మదన్ మోహన్ ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటుపై పలువురు బిజెపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం వారి అసలు వైఖరికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. అలాగే తుమ్మిడిహెట్టి బ్యారేజీ, ప్రాణహిత–చేవెళ్ల వంటి సాగునీటి ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టించడం వల్ల ఉత్తర తెలంగాణ రైతులు నష్టపోతున్నారని అన్నారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని ఆయన తెలిపారు.

## వెంకటాయపల్లి విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తాం






- సకల సమస్యలకు చదువు ఒక్కటే పరిష్కారం
- విద్యార్థుల సన్మాన సభలో గ్రామ సర్పంచ్ మరియు ఉపాధ్యాయులు

**జూన్ 3,(నగర నిజం ప్రతినిధి)**మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం వెంకటాయపల్లి స్థానిక గ్రామీణ గ్రంథాలయంలో బుధవారం రోజు పదవ తరగతి లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు,గ్రామ సర్పంచ్ మరియు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందించడం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిస్తూ,శాలువా తో సన్మానించారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదివే గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ బహుమతులు అందిస్తున్నమన్నారు.ఉన్నత చదువులు చదివేందుకు విద్యార్థులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు.అదేవిధంగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు సలహా సూచనలు ఇస్తామన్నారు.విద్యకు ప్రాధాన్యతనిస్తూ,విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను మరియు విద్య అభివృద్ధికి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న గ్రామ సర్పంచ్ రామాంజనేయులు ను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సక్కెరి రామాంజనేయులు,ఉప సర్పంచ్ మోహన్,ఉపాధ్యాయులు బంగారి సత్యానారాయణ,పట్నం చెన్నయ్య,మంగలి శ్రీనివాసులు,జంగం నాగేశ్వరయ్య,బంగారి వెంకటేష్, గ్రంథాలయ నిర్వాహకులు నరేష్, పరమేష్,బాల్ సాయన్న మరియు గ్రామ పెద్దలు,యువకులు,విద్యార్థులు పాల్గొన్నారు.



## రాచమల్ల జగన్మోహన్ ను సన్మానించిన నేతలు

- జగన్మోహన్ ను అభినందించిన గులాబీ నేత చిన్న గండు రాజేందర్, దండోరా నేత రాచమల్ల చిట్టిబాబు



**రాజేంద్రనగర్, జూన్ 3 (నగరనిజం ప్రతినిధి)** రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ గా నియమితులైన రాచమల్ల జగన్మోహన్ ను పలువురు నేతలు అభినందించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన రాచమల్ల జగన్మోహన్... జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో రాణిస్తుండడం అభినందనీయమని శంషాబాద్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిన్నగండు రాజేందర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత రాచమల్ల చిట్టిబాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సర్కిల్ పరిధిలోని సిద్ధాంతి బస్తీకి చెందిన దళిత నాయకుడు రాచమల్ల జగన్మోహన్ ను కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ గా నియమించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ గా నియమితులైన రాచమల్ల జగన్మోహన్ ను బీఆర్ఎస్ పార్టీ శంషాబాద్ ప్రధాన కార్యదర్శి చిన్నగండు రాజేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రాచమల్ల చిట్టిబాబు తదితర నేతలు శాలువా కప్పి తెలంగాణ సన్మానించారు. రాచమల్ల జగన్మోహన్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు.

## సురంగల్ ప్రభుత్వ పాఠశాలకు కొత్త కళ

- కాంగ్రెస్ నేత జైపాల్ రెడ్డి లక్ష రూపాయల విరాళం
- కౌన్సిలర్ శ్రీధర్ చొరవతో ముందుకొచ్చిన 13వ వార్డు ఇంచార్జ్

**ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులు ఉండాలన్నదే లక్ష్యం**



**మొయినాబాద్, జూన్ 4, (నగర నిజం):** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ ప్రభుత్వ పాఠశాలకు కొత్త కళ వచ్చింది. పాతబడిన పాఠశాల భవనానికి నూతనంగా రంగులు వేయించేందుకు 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ యాలాల జైపాల్ రెడ్డి లక్ష రూపాయలు విరాళం అందించారు. 14వ వార్డు కౌన్సిలర్ కర్రల శ్రీధర్ పాఠశాల పరిస్థితిని వివరించి, రంగులు వేయించాలని జైపాల్ రెడ్డిని కోరగా, ఆయన వెంటనే స్పందించి లక్ష రూపాయలు అందజేశారు. భవిష్యత్తులో కూడా పాఠశాలకు తన వంతు సాయం అందిస్తానని ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చి ఆర్థిక సాయం చేసిన జైపాల్ రెడ్డికి పాఠశాల ప్రిన్సిపల్ జహీర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సైతం జైపాల్ రెడ్డిని అభినందించారు. ప్రభుత్వ బడి పిల్లల భవిష్యత్తుకు ఈ సాయం ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కర్రల శ్రీధర్ మాట్లాడుతూ, "ప్రభుత్వ బడుల పిల్లలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా చదువుల్లో ర్యాంకులు సాధిస్తున్నారు. కానీ సౌకర్యాల పరంగా ప్రైవేట్, ప్రభుత్వ బడుల మధ్య వ్యత్యాసం ఉంది. ప్రభుత్వ బడులు కూడా అందంగా, ఆకర్షణీయంగా ఉండాలి. ఎక్కడో మూలన ఉన్నట్లు కనిపించకూడదు అనే ఉద్దేశంతోనే ఈ రంగులు వేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం" అని తెలిపారు. దేశానికి ప్రయోజకులను తయారుచేసే బడికి సాయం చేసిన జైపాల్ రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వ బడి పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ రెడ్డి, ఎల్గని అశోక్ గౌడ్ యాలాల మాధవరెడ్డి, బొర్రా జగన్, షేర్ బాయ్ శ్రీకాంత్ రెడ్డి, దుర్గం నరేష్, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు,

## విశ్వకర్మ మహాసభజన్నారం మండల ప్రధాన కార్యదర్శిగా బండోజు లక్ష్మీ నర్సయ్య




**హైద్రాబాద్ జూన్3 :**అఖిల భారత విశ్వకర్మ మహాసభ మంచిర్యాల జిల్లా జన్నారం మండల ప్రధాన కార్యదర్శి గా బండోజు లక్ష్మీ నర్సయ్య నియమితులైనారు ఈ మేరకుఅఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం శ్రీరాముల గంగాధర్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు సూచనతో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ బండోజు లక్ష్మీ నర్సయ్య మంచిర్యాల జిల్లాలో సంఘ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్బంగా బండోజు లక్ష్మీ నర్సయ్య ను వర్కింగ్ ప్రెసిడెంట్ గుండోజు గంగాధర్, ప్రధాన కార్యదర్శి సంకోజు లింగా చారి, కోశాధికారి ఆవంచ మురళీధరాచారి , అధికార ప్రతినిధి పడాల సతీష్ చారి, గౌరవ సలహాదారు కనపర్తి లక్ష్మణ్ చారి మహిళా గౌరవ అధ్యక్షురాలు సావిత్రి పట్నాల, కస్తోజు శ్రావణి మహిళా అధికార ప్రతినిధి, ఇంద్రాల అశ్విని మహిళాఉపాధ్యక్షురాలు, బోనాల ఇందిర మహిళాకార్య దర్శి , దాసోజు లక్ష్మణా చారి ఉపాధ్యక్షులు, లకొల్లోజు సురేష్ చారిప్రచార కార్యదర్శి, నరహరి చారి ముఖ్య సలహా దారు వీరాచారి జాయింట్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి కర్ణకంటి నరసింహాచారి. ఉపాధ్యక్షుడు కట్ట వెంకటేష్. అధ్యక్షుడు దాసోజు లక్ష్మణ్ చారి, ఉపాధ్యక్షుడు శ్రీరామ్ మహిపాల్ చారి, వెంకట్ చారి సలహా దారు, ఎడవల్లి రాఘవాచారి యూత్ సెక్రటరీ, కొండోజు సురేష్ చారి అధ్యక్షుడు అంబర్ పేట, కె లోకనాథం జుజ మెంబర్, తదితరులు అభినందించారు. పాల్గొన్నారు. జై విశ్వకర్మ!

## పీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ గా రాచమల్ల జగన్మోహన్





- వైస్ చైర్మన్‌గా నియమిస్తూ నియామకపు ఉత్తర్వులు జారీ చేసిన చైర్మన్ సత్యనారాయణ
- జగన్మోహన్‌ను అభినందించిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**రాజేంద్రనగర్, జూన్ 3(నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా లోని శంషాబాద్ కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత రాచమల్ల జగన్మోహన్ రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ గా నియమితులయ్యారు. ఈ మేరకు జగన్మోహన్ ను వైస్ చైర్మన్ గా నియమిస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేశారు రాష్ట్ర కమిటీ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ. మరోవైపు రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ గా నియమితులైన రాచమల్ల జగన్మోహన్ ను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అభినందించారు. ఎస్సీ డిపార్ట్మెంట్ ను పటిష్టవంతం చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీని మరింతగా బలోపేతం చేయడానికి కృషి చేయాలని మహేష్ కుమార్ గౌడ్ ఆయనకు దిశా నిర్దేశం చేశారు. శంషాబాద్ లోని సిద్ధాంతి గ్రామానికి చెందిన దళిత నాయకుడు రాచమల్ల జగన్మోహన్ ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్నారు. ఈ నేపద్యంలో ఆయనను రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ గా నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు తనకు రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సి సెల్ వైస్ చైర్మన్ గా అవకాశం కల్పించినందుకు గాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ సత్యనారాయణ కు రాచమల్ల జగన్మోహన్ కృతజ్ఞతలు చెప్పారు. పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని ఆయన ప్రకటించారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతలతో ఎస్సీ సామాజిక వర్గం అభ్యున్నతి తోపాటు పార్టీ పటిష్టత కోసం తన వంతు కృషి చేస్తానని జగన్మోహన్ వెల్లడించారు.

## నాణ్యమైన విద్యతోనే బంగారు భవిష్యత్తు మండల ఉపసర్పంచ్ సంఘం అధ్యక్షురాలు గోటూరి అనితరెడ్డి.



**మొయినాబాద్, జూన్ 3 (నగర నిజం):** నాణ్యమైన విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మండల ఉపసర్పంచ్ల సంఘం అధ్యక్షురాలు గోటూరి అనిత రెడ్డి, కేతిరెడ్డిపల్లి సర్పంచ్ గోడుగు యాదయ్యలు పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థిని టి.శ్రావంతి మండలంలోనే ద్వితీయ స్థానం మార్కులు 522 సాధించి కేతిరెడ్డిపల్లి పాఠశాలలో టాపర్ నిలిచారు. ఈ సందర్భంగా మండల ఉపసర్పంచ్ల సంఘం అధ్యక్షురాలు, కేతిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ గోటూరి అనితరెడ్డి కుమారుడు గోటూరి విష్ణువర్ధన్రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినికి సన్మాన కార్యక్రమంతో పాటు షీల్డ్, పది వేల నగదు ప్రధానం చేశారు. ఈ సందర్బంగా సర్పంచ్ గోడుగు యాదయ్యతో పాటు ఉపసర్పంచ్ అనితరెడ్డిలు పాల్గొని విద్యార్థిణీ శ్రావంతిని సన్మానించి షీల్డ్ బహుకరించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నప్పటికి వారికి ఉన్నత విద్యకు వెళ్లాలని ఎంతో ఆశ ఉంటుందన్నారు. నాణ్యమైన విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉందన్నారు. విద్యతోనే ఆర్థికాభివృద్ధి అన్న చందంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తారాబాయి, వార్డు సభ్యులు బొడ సుజాత, మంగలి నవీనా, అనిమని పావని, జంగిటి మహేందర్, గోటికె శ్రీకాంత్, ముజాఫర్,


# హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జాలిగం రాకేష్



కుత్బుల్లాపూర్, 3 జూన్ (నగర నిజం ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రివర్యులు హరీష్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా సిన్సియర్ ఎమ్మెల్యే శ్రీ తన్నీరు హరీష్ రావుకి జాలిగం రాకేష్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు."ప్రజలు మెచ్చిన నాయకుడు.. పేదలకు ఆత్మీయుడు.. మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు గారికి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు" అంటూ ఆయన అభినందనలు తెలిపారు. హరీష్ రావు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు.ఈ సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కందుకూరు విద్యుత్ అధికారి ఏఈ వేణుగోపాల్ రెడ్డి**



కందుకూరు .జూన్ 03 (నగరనిజం) :నేడు (గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కందుకూరు విద్యుత్ అధికారి ఏఈ వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పులిమామిడి సబ్ స్టేషన్ పరిధిలోని లెవెన్ కె.వి, పెద్దమ్మ తండా ఫీడర్ పరిధిలలో చెట్ల కొమ్మల తొలగించడం కోసం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు అలాగే మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు, రైతులు విద్యుత్ సంస్థకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నీటి ఆవాసాల నుంచి ఐదు సరికొత్త నీటి కీటకాల జాతులను కనుగొన్న భారతీయ శాస్త్రవేత్తలు



హైద్రాబాద్ జూన్ 3 (నగరనిజం) ;అంతరించిపోతున్న జీవవైవిధ్యంలో సరికొత్త ఆశలు చిగురిస్తున్నాయి. యావత్ ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న వాతావరణ మార్పుల వేళ భారతీయ శాస్త్రవేత్తలు సరికొత్త రికార్డులు సృష్టించారు. దేశంలోని వివిధ నీటి ఆవాసాల నుంచి ఐదు సరికొత్త నీటి కీటకాల జాతులను కనుగొన్నారు. ఈ అరుదైన జాతులను ప్రపంచంలోనే మొదటిసారిగా భారత్‌లో గుర్తించడం విశేషం. ఈ గొప్ప ఆవిష్కరణకు సంబంధించిన వివరాలు అంతర్జాతీయ ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధనకు సంబంధించి మరిన్ని విశేషాలు ఇప్పుడు చూద్దాం.ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల నేపథ్యంలో జీవవైవిధ్యంపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల కొన్ని జాతులు అంతరిస్తుంటే కొత్త జీవుల అన్వేషణ కూడా అంతే వేగంగా సాగుతోంది. ఇటీవల హైదరాబాద్ అత్తాపూర్‌లోని జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన ఇద్దరు యువ పరిశోధకులు. అరుదైన ఐదు కొత్త జల కీటక జాతులను కనుగొన్నారు. ఈ ఆవిష్కరణలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందడమే కాకుండా ప్రఖ్యాత సైన్స్ జర్నల్స్‌లో కూడా ప్రచురితమయ్యాయి.

# రాష్ట్రంలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5,నుంచి అమలు

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**





హైద్రాబాద్ జూన్ 3,(నగరనిజం) ;రాష్ట్రంలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5, 2026 నుంచి అమలు లోకి వస్తున్నట్లు మంత్రిపొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.భూముల విలువల సవరణను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టాంక్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల విశ్లేషణ ఆధారంగా కొత్త విలువలను నిర్ణయించామని,సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ప్రాంతాల వారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ విలువల మధ్య వ్యత్యాసాలను పరిశీలించాంగత బీఆర్ఎస్ ప్రభుత్వం శాస్త్రీయ అధ్యయనం లేకుండా భూముల ధరలను పెంచింది2021-22లో ఆరు నెలల వ్యవధిలో రెండు సార్లు భూముల విలువలు పెంచారురిజిస్ట్రేషన్ ఛార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచింది బీఆర్ఎస్ ప్రభుత్వంగత ప్రభుత్వ సవరణలలో కొన్ని చోట్ల మార్కెట్ ధరల కంటే తక్కువ, మరికొన్ని చోట్ల అధికంగా విలువలు నిర్ణయించబడ్డాయిభూ లావాదేవీలలో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పునర్వ్యమర్శ చేపట్టాంరాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువల సమీక్ష నిర్వహించామన్నారు.గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు స్థానిక పరిస్థితులను అధ్యయనం చేశాయి.అభివృద్ధి సామర్థ్యం, భూముల డిమాండ్, వేలాలు, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నాంఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కొత్త రహదారులు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాంఫ్లాట్ల విషయంలో ఉన్న అసమానతలను తొలగిస్తూ కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తులకు ఒకే రేటు అమలు చేశారు.ఇప్పటికే అధిక మార్కెట్ విలువలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపు ప్రతిపాదనలేదన్నారు.హెచ్ఎండీఏ, సీయూఆర్ఈ పరిధి, ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాంవ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస రేట్లు ఖరారు చేశాం2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించకపోవడంతో కొత్త రేట్ల అవసరం ఏర్పడిందినిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాల పెరుగుదలను పరిగణనలోకి తీసుకున్నాంఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాల రేట్లను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సవరించాంప్రజలకు ఇబ్బందులు కలగకుండా, పారదర్శకతతో ఈ సవరణలు చేపట్టాంభూ లావాదేవీలలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం కూడా వృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# డిండి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**గొర్ల కాపరితో పాటు వందలాది గొర్రెలు మృత్యువాత**



**నల్లగొండ జూన్ 3 (నగరనిజం) : నల్గొండ జిల్లా డిండి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గొర్ల కాపరితో పాటు వందలాది గొర్రెలు మృత్యువాత పడ్డాయి..సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులు పరిశీలించిన విప్ బీర్ల అయిలయ్యా, ఎమ్మెల్యే బాలు నాయక్, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, గోర్ల మేకల కార్పొరేషన్ల చైర్మన్ సరితా యాదవ్ తదితరులు పాల్గోన్నారు.**

# షూటింగ్ సందడిని శోకసంద్రంగా మార్చిన గుండెపోటు

**కెమెరా ముందే కుప్పకూలిన జూనియర్ ఆర్టిస్ట్.. కుటుంబ సభ్యుల కోసం పోలీసుల అన్వేషణ**



మేడ్చల్, జూన్ 3 (నగర నిజం): మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మునీరాబాద్‌లో ఉన్న ఓన్వా కన్వెన్షన్‌లో సినిమా షూటింగ్ సందర్భంగా ఓ జూనియర్ ఆర్టిస్ట్ గుండెపోటుతో మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, మే 30వ తేదీ రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్న జూనియర్ ఆర్టిస్ట్ ఆర్.ఎం.వి. భాస్కర్ (52) అకస్మాత్తుగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు ఆధారంగా ఆయన స్వస్థలం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతా ప్రాంతమని పోలీసులు గుర్తించారు. అయితే కుటుంబ సభ్యుల వివరాలు, సంప్రదింపు సమాచారం అందుబాటులో లేకపోవడంతో వారి ఆచూకీ కోసం మేడ్చల్ పోలీసులు విస్తృతంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.మృతుడి మొబైల్ ఫోన్‌లో సహచర జూనియర్ ఆర్టిస్టులు, ఏజెంట్‌కు సంబంధించిన ఫోన్ నంబర్లు మాత్రమే లభించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులను గుర్తించడం కష్టతరంగా మారిందన్నారు.ఆర్.ఎం.వి. భాస్కర్ కుటుంబ సభ్యులు, బంధువులు లేదా ఆయనకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే మేడ్చల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. మృతుడి కుటుంబ సభ్యులను గుర్తించి తదుపరి చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేయడానికి ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

**వందలాది మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ**




మేడ్చల్, జూన్ 3 (నగర నిజం): మేడ్చల్ పట్టణంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కాయిత ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో, సీఎంఆర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో పలువురు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సీఎంఆర్ హాస్పిటల్ చైర్మన్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గ్రామాలు, పట్టణాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద ప్రజలు ఎప్పుడైనా సీఎంఆర్ హాస్పిటల్‌ను సందర్శించి ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.శస్త్రచికిత్సలు అవసరమైన పేద రోగులకు తమ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వివిధ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సూచనలు అందించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాయుడు, అనుదీప్, కౌశిక్‌తో పాటు ముదిరాజ్ సంఘం నాయకులు వెంకటేష్, యాదగిరి, లింగం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గోపీనాథ్ ముండేకు భారతరత్న ప్రకటించాలని వంజరి సంఘాల డిమాండ్



హైదరాబాద్, జూన్ 3(నగరనిజం) : దేశంలోని బడుగు, బలహీన వర్గాల రాజకీయ సాధికారత కోసం విశేషంగా కృషి చేసిన ప్రముఖ నేత, స్వర్గీయ గోపీనాథ్ ముండే కు భారతరత్న పురస్కారం ప్రకటించాలని అఖిల భారత వంజరి సేవా సంఘం, తెలంగాణ వంజరి సేవా సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. అలాగే ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశాయి.గోపీనాథ్ ముండే 13వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లో వంజరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, దేశంలోని బడుగు వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు, వారికి ప్రత్యామ్నాయ జాతీయ రాజకీయ వేదికను అందించేందుకు గోపీనాథ్ ముండే నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు.జాతీయవాద రాజకీయాల్లో వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అందువల్ల భారతరత్నకు అన్ని విధాలా అర్హులని అన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలోనే మరణించిన గోపీనాథ్ ముండే సేవలను గుర్తించి, ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాలను కోరారు.తెలంగాణ రాష్ట్రానికి గోపీనాథ్ ముండే వంటి ప్రజానాయకుల అవసరం ఎంతో ఉందని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత వంజరి సేవా సంఘం నాయకులు సాల్వేరు కృష్ణ, ఎదుగని శంకర్, ఎదుగని హరినాథ్, కాలేరు సురేష్, ధాత్రిక కాశీనాథ్, కాలేరు యుగంధర్, రిటైర్డ్ డీఎస్పీ శివప్రసాద్, రత్నం సంతోష్ ఆముద లక్ష్మణ్, మహదేవ్ ముండే, కాలేరు సాయిబాబా, ఎదుగని వెంకటేష్ ,మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శిగా కొంకాని విజయ్ కుమార్



ఇబ్రహీంపట్నం, జూన్ 3 ( నగరనిజం ) : కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శిగా కొంకాని విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్, మానుకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియామక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శిగా కొంకాని విజయ్ కుమార్ ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ నియమించారు. ఈ మేరకు బుధవారం ఆయన చేతుల మీదుగా విజయ్ కుమార్ కు నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర కార్యదర్శిగా తనపై నమ్మకంతో నియమించినందుకు రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్, రాష్ట్ర మంత్రివర్యులు అడ్లూరి లక్షణ్, రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తమవంతు కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోనే దళితుల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందని వివరించారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఇందిరమ్మ గృహాలను మొదటి విడత పూర్తి చేయడం జరిగిందని రెండో విడత త్వరలోనే ప్రారంభిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా అర్హత కలిగిన వారందరికీ వివిధ రకాల పింఛన్లను అందజేయనుందామని వివరించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందులో తమ వంతుపాత్ర నిర్వహిస్తామన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంటు సెక్రెటరీగా నియమించిన పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి భైరిక రమాకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు యూనిఫాం అందజేత

## అంగన్వాడీ బడి బాట






**గజ్వేల్ మండలం, జూన్, 3 ,(నగరనిజం):శ్రీగిరిపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు సర్పంచ్ కల్సన, ఉప సర్పంచ్ బాలరాజు, వార్డు నెంబర్ వెంకటేశ్, గ్రామ సభ్యులు మంతూర్తి రమేష్, పాండవుల నరేష్, చేతుల మీదగా అంగన్వాడీ స్కూల్ యునిఫాం అందచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ నిర్మాల, పద్మజా, రమా ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, మరియు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.**

# పెట్టుబడులకు ఆహ్వానం.. ప్రోత్సహకాలు పుష్కలం

**దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ ముసటైల్తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ**



హైదరాబాద్, జూన్ 3 (నగరనిజం) : రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపించే దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ పాలస్ షిపొకోసా మషటైల్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి తో భేటీ అయింది. ఈ భేటీలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.. దక్షిణాఫ్రికా–తెలంగాణ మధ్య వాణిజ్య సంబంధాలను, ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేఅంశంపై ఈ సమావేశంలో చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి వివరించారు. పెట్టు బడులకు సై సమావేశంలో దషటైల్మాట్లాడుతూ... "తెలంగాణలో మా ప్రతినిధి బృందానికి ఆత్మీయ స్వాగతం పలికినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు. తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవం వేళ ప్రభుత్వానికి, ప్రజలకు శుభాకాంక్షలు. ఈ వేడుకల సందర్భంగా మీ మధ్య ఉండటం గౌరవంగా భావిస్తున్నాం. ఈపర్యటనలో శాస్త్రీయ, సాంకేతిక మరియు పెట్టుబడి సహకార రంగాల్లో మరింత విస్తృత భాగస్వామ్యాన్ని మేము ఆశిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు."భారతదేశంలోని అత్యంత యువ రాష్ట్రాల్లో ఒకటైన కాలంలోనే భారత జాతీయ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)కి అత్యధికంగా తోడ్పడుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ, అతి తక్కువ ఒకటిగా ఎదగడం అభినందనీయం. తెలంగాణ ప్రజల పట్టుదల, సృజనాత్మకత, సంకల్పానికి ఈ విజయాలు నిదర్శనం" అని పేర్కొన్నారు.

**దక్షిణాఫ్రికా కంపెనీలకు ఆహ్వానం**

భారత్ దక్షిణాఫ్రికా మధ్య సంబంధాల విషయంలో చారిత్రక నేపథ్యాన్ని సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు వివరిస్తూ, "సాంకేతికత, ఔషధ రంగం, వ్యాక్సిన్లు, రక్షణ, ఏరోస్పేస్, పరిశోధన, విద్య, అరోగ్యం, తయారీ, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు మరియు మౌలిక సదుపాయాల రంగాలలో తెలంగాణ విశిష్ట ప్రతిభను కలిగి ఉంది" అని చెప్పారు. "గ్రీన్ ఎనర్జీ, సుస్థిర అభివృద్ధి రంగాలలో తెలంగాణ వేగంగా ముందుకు సాగుతోంది. ద్వైపాక్షిక సంబంధాలను మరింత పెంచే అవకాశాలు ఉన్నందున తెలంగాణలో పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలని దక్షిణాఫ్రికా కంపెనీలను ఆహ్వానిస్తున్నాం" అని చెప్పారు.

# జనసేన పార్టీలో చేరిన కమ్మరి శ్రీనివాస్

**జనసేన పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్తాం - కమ్మరి శ్రీనివాస్**



గజ్వేల్ నియోజకవర్గం, జూన్ ,3,(నగర నిజం): గజ్వేల్ కు చెందిన సీనియర్ నాయకుడు కమ్మరి శ్రీనివాస్ ఇటీవల బీజేపీకి రాజీనామా చేశారు. బుధవారం హైదరాబాద్ లో జనసేన పార్టీ అధినేత ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా కండువా కప్పుకుని జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కమ్మరి శ్రీనివాస్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని లక్ష్యంతో జనసేన పార్టీలో చేరడం జరిగిందని,గజ్వేల్ నియోజక వర్గంలో జనసేన పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్ళడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని,యువతకు ఆదర్శం పవన్ కళ్యాణ్ అని తెలంగాణలో జనసేన పార్టీ విస్తృతపరచడానికి నా వంతు కృషి చేస్తానని పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడవడానికి, ఎంతోమంది సిద్ధంగా ఉన్నారని అన్నారు.


# వ్యవసాయం, సాగునీటి నిర్వహణకు సంబంధించి ముందస్తు ప్రణాళికతో పని చేయాలి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఎల్నినో పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి**
**పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా నివారించాలి**
**సాగునీటి లభ్యతపై రైతులకు ముందస్తు సమాచారం అందించాలి**
**వ్యవసాయం, హార్టికల్చర్, ఇరిగేషన్ శాఖలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం(నగర నిజం బ్యూరో) జూన్ 3(నగరనిజం) :జిల్లాలో వ్యవసాయం, సాగునీటి నిర్వహణకు సంబంధించి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్లోని తన ఛాంబర్లో బుధవారం ఇరిగేషన్, హార్టికల్చర్, వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ నానో యూరియా ప్లస్ వినియోగంపై రైతుల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. యూరియా వినియోగాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.వరి కోతల అనంతరం పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పంట అవశేషాలను కాల్చినట్లయితే జరిమానాలు విధించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పొలాల్లో మంటలు పెట్టడం వల్ల అవి అదుపు తప్పి చెట్లు, పక్కనే ఉన్న పంటలు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు తదితర ఆస్తులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందని, ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు.ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులను పప్పు ధాన్యాలు, ఆయిల్ పామ్, కూరగాయలు, తదితర ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు పంట మార్పిడి విధానం, యూరియా వినియోగాన్ని తగ్గించే పద్ధతులపై క్రమం తప్పకుండా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.గ్రామాల వారీగా బోర్వెల్ ఆధారంగా సాగు చేసే రైతులు, కాలువలపై ఆధారపడి, బోర్ల ద్వారా సాగు చేసే రైతులు, చివరి ఆయకట్టు రైతులను ముందుగానే గుర్తించాలని సూచించారు. తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో వీరు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భ జలాలు తగ్గిపోయే అవకాశం ఉన్నందున బోర్వెల్ ఆధారంగా వరి సాగు చేయడం రైతులకు లాభసాటిగా ఉండదని పేర్కొన్నారు.చివరి ఆయకట్టు ప్రాంతాల రైతులను ప్రత్యేకంగా మ్యాపింగ్ చేసి స్థానిక సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల భాగస్వామ్యంతో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.అనంతరం సాగునీటి సరఫరా, తదితర అంశాలపై ఇరిగేషన్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సాగునీటి లభ్యతపై రైతులకు సులభంగా అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ, హార్టికల్చర్, ఇరిగేషన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీశ్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శివప్రకాశ్



ఎల్బీనగర్, జూన్ 3 (నగర నిజం): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శివప్రకాశ్, మాజీ మంత్రి మరియు టి.హరీష్ రావును వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావుకు పుష్పగుచ్ఛం అందజేసి, ఆయురారోగ్యాలతో పాటు ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర రాజకీయాల్లో హరీశ్ రావు అందిస్తున్న సేవలు, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం ఆదర్శప్రాయమని శివప్రకాశ్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ చేతల పార్టీ. బిఆర్ఎస్ చేతకాని పార్టీ సవాల్‌ను స్వీకరించే దమ్ములేని కేటీఆర్



ఖమ్మం: (నగర నిజం బ్యూరో) జూన్ 3,అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి, పార్లమెంట్ ఎన్నికల్లో సున్నాకు పడిపోయి.. సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లోనూ చిత్తుచిత్తుగా బీఆర్ఎస్ ఓడిపోవడం.. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీదే అధికారం అని స్పష్టత రావడంతో డ్రామారావుకు ఫ్రస్టేషన్ పెరిగిపోయింది.జర్నలిస్ట్ అంత స్పష్టంగా హైదరాబాద్‌లో ఇండ్ల నిర్మాణాలపై నేను చేసిన సవాల్ గురించి ప్రశ్న అడిగితే.. దానిపై సమాధానం చెప్పలేక, సవాల్‌ను స్వీకరించే దమ్ములేని దద్దమ్మ కేటీఆర్, 'మూసుకొని ఇంట్లో కూర్చో' అంటూ దొరతనం, అహంకారంతోమాట్లాడుతున్నారు.సీఎం హెదాలో ఉండిఎమ్మెల్యేగా ఓడిపోయిన కేసీఆర్ మూసుకొని ఫాంహౌస్‌లో ఉన్న విషయం మర్చిపోతే ఎలా డ్రామారావు.తొలి రెండున్నర సంవత్సరాల్లోనే సీఎం రేవంత్ రెడ్డినాయకత్వంలో అతి తక్కువ సమయంలోనే లక్షలాది మంది పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు అందించామని చెప్పడానికి సంతోషిస్తున్నాను.గ్రామాల్లో పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన ఇండ్ల కంటే, కేవలం మొదటి రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడు రెట్లు ఎక్కువ సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించింది. ఇందిరమ్మ ఇండ్లు నిరంతర ప్రక్రియ. రెండో దశ తరువాత మూడో దశ, నాలుగో దశలో కూడా లక్షలాది ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం. అర్హులైన ప్రతి పేదవారికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ఈ ప్రజాప్రభుత్వం పనిచేస్తుంది.వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి, హైదరాబాద్ పరిధిలోనూ బీఆర్ఎస్ పదేండ్లలో కట్టిన ఇండ్ల కంటే, ఎక్కువ ఇండ్లు కట్టి తీరుతాం. ఎక్కువ ఇండ్లు కడితేనే నేను ఎమ్మెల్యేగా పోటీ చేస్తా.. ప్రజలను ఓట్లు అడుగుతా.. కాంగ్రెస్ ఎక్కువ ఇండ్లు కడితే ఎమ్మెల్యేగా పోటీ చేయకుండా ఉండేందుకు మీరు సిద్దమేనా కేటీఆర్..? చేతనైతే నా సవాల్‌ను స్వీకరించు..!

# బలిజగూడలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



అబ్దుల్లాపూర్ మెట్, జూన్ 3 (నగర నిజం): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బలిజగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా "గ్రామ సర్పంచ్ ఉప్పు మాధవి, నవీన్ కుమార్" జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా "సర్పంచ్ ఉప్పు మాధవి" మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం 60 ఏళ్ల ఉద్యమ ఫలితంగా, ఎందరో అమరవీరుల త్యాగాల ద్వారా సాధ్యమైందని అన్నారు. రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం పాల్గొన్న వారికి మిఠాయిలు పంపిణీ చేసి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశభక్తి, తెలంగాణ స్ఫూర్తిని ప్రతిబింబించేలా కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# గడ్డిఅన్నారం డివిజన్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**జాతీయ జెండా ఆవిష్కరణ**
**తెలంగాణ ఉద్యమ అమరవీరులకు ఘన నివాళులు**



ఎల్బీనగర్, జూన్ 3(నగర నిజం): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీనగర్ నియోజకవర్గంలోని గడ్డిఅన్నారం డివిజన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేక మంది అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాల ఫలితంగా సాధించుకున్న రాష్ట్రంగా నిలిచిందన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, మహిళా నాయకురాలు లక్ష్మి దేవి, నవీన్, నాగరాజ్, శ్రీకాంత్, రమేష్, రాజేష్ జైస్వాల్, సతీష్‌తో పాటు కాలనీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**గండాలు దాటుకుని**
**గమ్యాన్ని ముద్దాడిన చారిత్రక దినం**
**తెలంగాణ ఆవిర్భావం**

**తెలంగాణమంటే...**
**ఆత్మ గౌరవ సామాజిక పూల వనం**
**జంగు నడిపిన ఇసుక చెలిమెలు**

**తెలంగాణమంటే...**
**రాలిన పూలతో గట్టిన**
**మోదుగు పూల దండ**
**వీరుల రక్తంతో గీసిన**
**చిత్రపటం**

**తెలంగాణమంటే...**
**ఎర్రని ఎండలో పెయ్యినిండా**
**సల్లని చెమటలు పట్టిన**
**సామాజిక నినాదం**

**తెలంణమంటే...**
**పోరు కాగితంపై**
**నెత్తుటి సంతకాలు**

**తెలంగాణమంటే...**
**తెలంగాణ వ్యతిరేకులతో ఏలే**
**రాజ్య వ్యవస్థ కాదు**
**ఉద్యమ అణిచివేతకు**
**ఉరికించి కొట్టిన నియంతల**
**నిర్మాణం కాదు**

**తెలంగాణమంటే...**
**సామాజిక నినాదం ఎత్తుకొని**
**మళ్ళీ నియంతృత్వ పోకడలపై**
**పోరుకు సన్నద్ధం అవుతున్న**
**నెత్తుటి గాయాల పోరు సంకేతం**
**తిరుగుబాటు యుద్ధ నినాదం**
**కాలోజీ చెప్పిన ప్రాంతీయత**
**మోసం పై చేసే చరిత్ర సంతకం**

**తెలంగాణ అవతరణ దినోత్సవ శు భాకాంక్షలు...**

**రచన: మీ పద్మ రవీందర్ గౌడ్**
**హైదరాబాద్/నగర నిజం**

# మజీద్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**జాతీయ జెండా ఆవిష్కరించిన సర్పంచ్ మేడిపల్లి ప్రియా చంద్రశేఖర్**



అబ్దుల్లాపూర్ మెట్, జూన్ 3 (నగర నిజం): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మజీద్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. "గ్రామ సర్పంచ్ మేడిపల్లి ప్రియా చంద్రశేఖర్" ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ అమరవీరులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా "సర్పంచ్ మేడిపల్లి ప్రియా చంద్రశేఖర్" మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేక మంది ఉద్యమకారుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షల ఫలితంగా ఏర్పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, గ్రామీణ ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మిఠాయిలు పంపిణీ చేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు గోపగోని శివకుమార్, దూసరి నవనీత గణేష్, మేడిపల్లి కరుణాకర్, పాలపాటి నరసింహ, బుట్టి సంగీత రమేష్, నజుటి లావణ్య శ్రీనివాస్, ఎలక్కరాజ్ రఘు, నర్సింగ్ అనూష నాగరాజ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, మాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గడ్డం బాలకిషన్, మాజీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కమలానగర్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





ఎల్‌బీనగర్, జూన్ 3 (నగర నిజం): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు చెన్నగౌని శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకుంటూ నాయకులు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేక త్యాగాలు, ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న గౌరవప్రదమైన రాష్ట్రంగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో హయత్‌నగర్ బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సింగిరెడ్డి మల్లేశ్వరి రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు అంజలి గౌడ్, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు బీఆర్ఎస్ లీలా, విజయలక్ష్మి, రజిత రెడ్డి, అర్చన, సుజాతతో పాటు పలువురు మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వాతి రెసిడెన్సీ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



ఎల్‌బీనగర్, జూన్ 3 (నగర నిజం): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీరన్నగుట్టలో ఉన్న స్వాతి రెసిడెన్సీ కాలనీలో నెలకొన్న పలు మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారం కోసం స్వాతి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు మాట్లాడుతూ, గతంలో ఏర్పాటు చేసిన యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) మరియు ఇంటర్నల్ పైప్‌లైన్ వ్యవస్థల కారణంగా పలు సమస్యలు తలెత్తి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా కాలనీ పార్క్‌కు ప్రహరీ గోడ నిర్మించి, జిమ్ పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కాలనీలోని రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్య సమస్యలు మరియు ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వినతులను ఆలకించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం తమ ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ యువ నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి, స్వాతి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమనాథ్, ఉపాధ్యక్షుడు భాస్కర్ గౌడ్, వరుణ్, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో కారు ప్రమాదం.. మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సతీమణికి గాయాలు




ఎల్‌బీనగర్, జూన్ 3 (నగర నిజం): అమెరికాలో జరిగిన కారు ప్రమాదంలో మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ సతీమణి, ప్రముఖ ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ సుచి యాష్కి గాయపడ్డారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, మధుయాష్కీ గౌడ్ దంపతులు తమ చిన్న కుమార్తె డాక్టర్ గగన యాష్కి ను అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ అనుబంధ ఆసుపత్రిలో ఎండీ కోర్సులో చేర్పించి తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బోస్టన్ నుంచి న్యూయార్క్‌కు వస్తుండగా వర్షం కారణంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో డాక్టర్ సుచి యాష్కీకి పక్కటెముకలు (రిబ్స్) విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ గగన యాష్కి ఇటీవల న్యూయార్క్ మెడికల్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగా, ఆమె కాన్వొకేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు మధుయాష్కీ గౌడ్ అమెరికా వెళ్లారు. అనంతరం కుమార్తెను ఎండీ కోర్సులో చేర్పించే కార్యక్రమంలో భాగంగా ఎక్కువ లగేజీ ఉండటంతో మధుయాష్కీ గౌడ్, డాక్టర్ సుచి యాష్కీ వేర్వేరు కార్లలో ప్రయాణించినట్లు తెలిసింది. తిరుగు ప్రయాణంలో డాక్టర్ సుచి యాష్కి ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. కాగా, మధుయాష్కీ గౌడ్ రేపు భారత్‌కు తిరిగి రావాల్సి ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఆయన అమెరికాలోనే ఉండి కుటుంబ సభ్యులతో కలిసి వైద్య చికిత్సను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం.



# -విదేశీ పౌరుల విషయంలో తస్మాత్ జాగ్రత్త - శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్

**తప్పనిసరిగా ఇమ్మిగ్రేషన్ మరియు ఫారినర్స్ చట్టం నిబంధనలు పాటించి తీరాలన్న డీసీపీ**

**హోటల్స్,లాడ్జీలు, అద్దె గృహాలు, విద్యా సంస్థలు సహా ఆసుపత్రుల్లో నిబంధనలు పాటించి తీరాలని డీసీపీ ఆదేశం**


**తప్పనిసరిగా విదేశీ పౌరుల రాకపోకల వివరాలు నమోదు చేయాలని డీసీపీ రాజేష్ ఆదేశం**






రాజేంద్రనగర్, జూన్ 3(నగరనిజం ప్రతినిధి) శంషాబాద్ జోన్ పరిధిలో నివాసం ఉండడంతో పాటు విద్యా,వైద్యం కోసం వచ్చే విదేశీ పౌరుల విషయంలో తప్పనిసరిగా ఇమ్మిగ్రేషన్, ఫారినర్స్ చట్టం నిబంధనలు పాటించి తీరాలని శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ ఆదేశాలు జారీ చేశారు. 2025 చట్టం ప్రకారం విదేశీ పౌరులు తప్పనిసరిగా ఫారం-2, ఫారం-3 (ఫారం సి) సమర్పించాలని డీసీపీ రాజేష్ ఆదేశాలు జారీ చేశారు. శంషాబాద్ జోన్ పరిధిలో నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. విదేశాల నుండి రాష్ట్రానికి వస్తున్న వారు చాలామంది శంషాబాద్ జోన్ నివాసం ఉంటున్నారని ఆయన తెలిపారు. విద్య, వైద్యం కోసం నగరానికి వస్తున్న విదేశీ పౌరులు శంషాబాద్ జోన్ పరిధి లోని హోటల్స్, లాడ్జీల తో పాటు అద్దె గృహాల్లో నివసిస్తున్నారని డీసీపీ రాజేష్ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. అయితే విద్యా, వైద్యం కోసం వచ్చి నివసిస్తున్న విదేశీ పౌరులకు సంబంధించి ఇమ్మిగ్రేషన్ మరియు ఫారినర్స్ 2025 చట్టం ప్రకారం పూర్తి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ఆయన ఆదేశించారు. విదేశీ పౌరులకు సంబంధించి తప్పనిసరిగా ఫారం-2, ఫారం-3 (ఫారం-సి) సమర్పించాలని డీసీపీ రాజేష్ ఆయా సంస్థలను ఆదేశించారు. అదేవిధంగా హోటల్స్, లాడ్జీల తో పాటు అద్దె గృహాలు, విద్యాసంస్థల్లో వసతి పొందే విదేశీ పౌరుల నిష్క్రమణ (డిపార్చర్) కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించాలని ఆయా సంస్థలను డీసీపీ రాజేష్ ఆదేశించారు. విదేశీ పౌరులు ఆయా ప్రాంగణాల్లో చేరాక 24 గంటల్లోపు నిర్దేశిత ఆన్ లైన్ పోర్టల్ ద్వారా పూర్తి సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా విద్యా సంస్థల్లో చేరే విదేశీ విద్యార్థులకు సంబంధించి ఆయా సంస్థలు తప్పనిసరిగా ఆన్ లైన్ ద్వారా ఫారం -2 ను సమర్పించాలని డీసీపీ రాజేష్ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో విదేశీ విద్యార్థుల ప్రవేశం దగ్గర నుండి నిష్క్రమణ వరకు సమగ్ర సమాచారాన్ని సమర్పించాలని ఆదేశించారు. ఓసిఐ కార్డు కలిగిన వారితోపాటు నేపాల్ పౌరులు, ఇతర విదేశీ పౌరులకు ఈ నిబంధనలు వర్తిస్తాయని డీసీపీ పేర్కొన్నారు. విదేశీయులకు వసతి కల్పించే సంస్థలు తప్పనిసరిగా ఫారం-3 ని సమర్పించి తీరాలని, అలా చేయని వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ రాజేష్ తీవ్రంగా హెచ్చరించారు. ఆయా సంస్థలు విదేశీ పౌరులకు సంబంధించి సేకరించిన సమాచారాన్ని ఖచ్చితంగా కనీసం ఏడాది కాలం పాటు భద్రపరచాలని ఆయన ఆదేశించారు.

# మే నెలలో రికార్డు స్థాయిలో 1.21 కోట్ల తిరుపతి లడ్డూల విక్రయం



తిరుపతి జూన్ 03 (నగరనిజం) : కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానంతరం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వీకరించే శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో టీటీడీ లడ్డూ ఉత్పత్తిని కూడా విస్తృతంగా పెంచి, ఎలాంటి కొరత లేకుండా ప్రసాదాలను అందిస్తోంది. ఈ ఏడాది మే నెలలో మొత్తం 1,21,35,528 లడ్డూలు విక్రయమయ్యాయి. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది లడ్డూల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. 2024 మే నెలలో 1.01 కోట్ల లడ్డూలు విక్రయమవ్వగా, 2025లో 1.10 కోట్లకు పెరిగాయి. ప్రస్తుతం 2026లో 1.21 కోట్లకు పైగా విక్రయాలు నమోదవడం విశేషం. లడ్డూ తయారీకి 68 టన్నుల ముడి పదార్థాల వినియోగంఅత్యంత పవిత్రమైన శ్రీవారి ప్రసాదమైన లడ్డూల తయారీ కోసం రోజువారీగా 68 టన్నులకు పైగా ముడి పదార్థాలను టీటీడీ వినియోగిస్తోంది. లడ్డూ తయారీకి రోజుకు సుమారు 32 టన్నుల చక్కెర, 16 టన్నుల శెనగపిండి, 16 టన్నుల నెయ్యి, 3.5 టన్నుల జీడిపప్పు, 2 టన్నుల ఎండుద్రాక్ష, 400 కిలోల యాలకులు, 800 కిలోల కలకండ వినియోగిస్తున్నారు. ఒక్క చిన్న లడ్డూ తయారీకి సగటున 167 నుండి 170 గ్రాముల ముడి పదార్థాలను ఉపయోగిస్తున్నారు. ఇందులో సుమారు 78 గ్రాముల చక్కెర, 39 గ్రాముల శెనగపిండి, 36 గ్రాముల నెయ్యి, 7 గ్రాముల జీడిపప్పు, 3 గ్రాముల ఎండుద్రాక్ష తదితర పదార్థాలు ఉంటాయి. సంప్రదాయ దిట్టం ప్రకారమే తయారీశ్రీవారి ప్రసాదాల తయారీలో 1950, 1951 సంవత్సరాల్లో టీటీడీ ఆమోదించిన సంప్రదాయ "దిట్టం" ప్రమాణాలను నేటికీ ఖచ్చితంగా పాటిస్తున్నారు. నిత్య, వార, పక్ష, మాస, నక్షత్ర, సాలకట్ల ఉత్సవాలకు అనుగుణంగా సుమారు 20 రకాల అన్నప్రసాదాలు, 25 రకాల పణ్యారాలను సిద్ధం చేస్తున్నారు. భక్తుల ప్రశంసలుఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత, సంప్రదాయం, భక్తి భావనల సమ్మేళనంగా నిలిచిన శ్రీవారి లడ్డూ ప్రసాదం తిరుమల మహత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెబుతోంది.

# ఐసీఏఆర్-సీఆర్ఐడీఏ ఆధ్వర్యంలో 'సేవ్ ది ఫీల్డ్ క్యాంపెయిన్ 2026' నిర్వహణ





సంగారెడ్డి, 3 జూన్ (నగర నిజం) :ఐసీఏఆర్-సీఆర్ఐడీఏ ఆధ్వర్యంలో "సేవ్ ది ఫీల్డ్ క్యాంపెయిన్ 2026" (ఖేత్ బచావో అభియాన్) కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని ముబారక్‌పూర్ బి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐసీఏఆర్-సీఆర్ఐడీఏ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతిభ, డాక్టర్ బి.ఎం.కె. రాజు, డాక్టర్ జోసిలీ శామ్యూల్ ఆధ్వర్యంలో చేపట్టారు. రైతుల్లో సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించడం, అధిక ఎరువుల వాడకం వల్ల నేల, నీటి కాలుష్యం ఎలా పెరుగుతుందో వివరించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వహించారు. పంటల ఆధారంగా సరైన పోషకాలు ఎంతమేర అవసరమో తెలుసుకోవడానికి మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని రైతులకు ప్రదర్శించారు. సేంద్రీయ ఎరువులు, కంపోస్ట్, గ్రీన్ మ్యాన్యూర్, బయో ఫర్టిలైజర్లు, పంట అవశేషాల పునర్వినియోగం వంటి ప్రత్యామ్నాయ ఎరువుల వనరులపై రైతులకు అవగాహన కల్పించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, పత్తి మిషన్ల ద్వారా లభించే ప్రయోజనాలు, పంటల వైవిధ్యీకరణ అవసరాన్ని వివరించారు. గ్రామ రైతులకు పత్తి పంటలో హెచ్‌డీపీఎస్ నాటే విధానం వంటి ఆధునిక సాంకేతికతలపై పూర్తి అవగాహన లేకపోవడంతో వాటి ప్రయోజనాలను వివరించారు. ఈ విధానాన్ని అమలు చేయడానికి రైతులు ఆసక్తి చూపినట్లు తెలిపారు. అలాగే రైజ్డ్ బెడ్ ప్లాంటింగ్, మల్చింగ్ పద్ధతులు నీటి సంరక్షణలో ఎంతగానో ఉపయోగపడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది రైతులు పాల్గొనగా, అందులో 20 మంది మహిళా రైతులు ఉన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రేఖ, ఉపసర్పంచ్ మహేష్, వ్యవసాయ విస్తరణాధికారి సిరీష కూడా పాల్గొని కార్యక్రమ విజయవంతానికి సహకరించారు.

# తెల్లాపూర్‌లో ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు


**అనాథ ఆశ్రమ పిల్లల నడుమ కేక్ కట్ చేసి దుస్తులు, టిఫిన్ బాక్సుల పంపిణీ**

**నేను చనిపోయినా నా అభివృద్ధి పనులు తెల్లాపూర్‌లో శాశ్వతంగా గుర్తుంటాయి: మాజీ సర్పంచ్ సోమిరెడ్డి**

**ఇకపై కార్పొరేటర్‌గా పోటీ చేయను.. కొత్తవారికి అవకాశం ఇస్తా**





నగర నిజం ప్రతినిది విజయ్ కుమార్ జూన్ 3 సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను తెల్లాపూర్ మాజీ సర్పంచ్ లలితా సోమిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అనాథ ఆశ్రమంలోని పిల్లల నడుమ కేక్ కట్ చేసి, వారికి నూతన వస్త్రాలు, టిఫిన్ బాక్సులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సోమిరెడ్డి మాట్లాడుతూ.. తమ రాజకీయ గురువు హరీష్ రావు జన్మదిన వేడుకలను అనాథ పిల్లల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆ పిల్లలు అనాథలు కారని, ఇప్పటి నుండి తన వంతు సహాయంగా వారికి ఎల్లప్పుడూ చేదోడు వాదోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. హరీష్ రావు రాజకీయ జీవితంలో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

### నేను లేకపోయినా నా జ్ఞాపకాలు సజీవం..

"నేను తెల్లాపూర్‌లో ఒక వార్డ్ మెంబర్‌గా, సర్పంచ్‌గా, మున్సిపల్ ఛైర్మన్‌గా పదవులు చేపట్టాను. భవిష్యత్తులో నేను చనిపోయిన తర్వాత కూడా నేను చేసిన అభివృద్ధి పనులే నన్ను బతికిస్తాయి. ఇక్కడి గ్రామపంచాయతీ భవనం, మున్సిపల్ కార్యాలయం, విశ్వకర్మ గుడి, తెల్లాపూర్‌శ్రీ లో చర్చి, బీరప్ప గుడి, ఇక్కడి రోడ్లను చూసిన ప్రతిసారీ ప్రజలకు సోమిరెడ్డి జ్ఞాపకాలు గుర్తొస్తాయి" అని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. హరీష్ రావు ఇచ్చిన సహకారంతోనే తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయము,కల్యాణ వేదిక లాంటి ఎన్నో మౌలిక వసతులు కల్పించగలిగామని వివరించారు.

### హరీష్ అన్న విజన్ వల్లే ఇక్కడ సర్కిల్ ఆఫీస్..

ఒక సందర్భంలో పటాన్‌చెరు కార్పొరేటర్, పటాన్‌చెరు మున్సిపల్ కార్యాలయాన్ని తెల్లాపూర్ సర్కిల్‌లో విలీనం చేశారని అధికారులను అడిగినప్పుడు.. ఇక్కడి తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎంతో విశాలంగా ఉందని, అందుకే కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగిస్తామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌కు అధికారులు స్పష్టం చేశారని సోమిరెడ్డి గుర్తుచేశారు. సర్కిల్ ఆఫీస్ తెల్లాపూర్‌లోనే ఉండటానికి కారణం నాడే హరీష్ అన్న చొరవతో ఇక్కడ ఇంత పెద్ద మున్సిపల్ కార్యాలయం నిర్మించడమేనని, ఆ ఘనత హరీష్ రావుదేనని కొనియాడారు.

### ఇకపై కార్పొరేటర్‌గా పోటీ చేయను..

తాను పదవుల కోసం ఆశపడే వ్యక్తిని కాదని సోమిరెడ్డి స్పష్టం చేశారు. ఇకపై రాజకీయంలో తాను కార్పొరేటర్‌గా పోటీ చేయనని, కొత్త వారికి అవకాశం కల్పించి, వారి వెన్నంటి ఉంటూ ఒక సాధారణ కార్యకర్తలా పనిచేస్తానని హామీ ఇచ్చారు. తాను మాట ఇస్తే తప్పని మనిషినని, గతంలో ఇచ్చిన మాట కోసం సర్పంచ్ పదవికి రాజీనామా చేసిన ఘనత తనదని, నాడు హరీష్ రావు రాజీనామా పత్రాన్ని వెనక్కి తీసుకోమన్నా.. ప్రజల కోసం వెనకడుగు వేయలేదని అన్నారు.

### ప్రతిపక్షాల వైఫల్యాలను ఎండగట్టిన సోమిరెడ్డి..

కొల్లూరు రాజకీయ వివాదం కారణంగా, స్పెషల్ ఆఫీసర్ల హయాంలో అభివృద్ధి కొరకు కేటాయించిన రూ. 6 కోట్ల నిధులను జిల్లా కలెక్టర్‌కు వదిలేసిన ఘనత ఇక్కడి ప్రతిపక్ష నాయకులదేనని ఎద్దేవా చేశారు. తాను ఏ పదవిలో లేనప్పుడు కూడా స్థానిక ఎంపీ సహాయంతో రెండు డ్వాక్రా మహిళా భవనాలు, 15 ఐమాక్స్ స్ట్రీట్ లైట్లు, ఆరు బోర్లు వేయించి ప్రజలకు అందుబాటులో ఉన్నానని తెలిపారు.

### ప్రశ్నించే గొంతు మాది.. అభివృద్ధి మీది!

కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాటలే తప్ప చేతలు లేవని సోమిరెడ్డి విమర్శించారు. "ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది, మేము ప్రతిపక్షంగా మిమ్మల్ని ప్రశ్నిస్తాం.. మీరు అభివృద్ధి చేసి చూపించండి. ప్రశ్నిస్తే అప్పటికప్పుడే ప్రెస్ మీట్లు పెట్టడం కాదు, ప్రజలకు ఏం చేశారో చెప్పాలి" అని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నాయకులు కేవలం వారి పార్టీ వారు బాగుంటే చాలని చూస్తారే తప్ప, ప్రజల గురించి పట్టించుకోరని మండిపడ్డారు. దేశాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టిన ఘనత బీజేపీ, కాంగ్రెస్ పార్టీలదేనని, దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణ నిధులను మళ్లించడమే వారి పని అని ఆరోపించారు.

### వచ్చే రెండేళ్లలో బీఆర్ఎస్ ఘనవిజయం ఖాయం..

బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా ఉండాలని, వచ్చే రెండేళ్లలో పార్టీ ఘనవిజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా ఫలితం ఉంటుందన్నారు. కేసీఆర్ ఉద్యమం చేసి తెలంగాణ తెచ్చారు కాబట్టే.. తెలంగాణపై కేసీఆర్‌కు, హరీష్ రావుకు, ఇక్కడి ప్రజలకు మరియు ఇక్కడ స్థిరపడిన ఆంధ్రప్రదేశ్ వాసులకు కూడా ప్రత్యేకమైన ప్రేమ ఉంటుందని సోమిరెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు , బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు మరియు ఆశ్రమ సిబ్బంది, పిల్లలు పాల్గొని హరీష్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# ఘనంగా చిదర నాగేందర్ పెళ్లిరోజు వేడుకలు




దిల్‌సుఖ్‌నగర్, 3 జూన్ (నగర నిజం) : గడ్డి అన్నారం ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయం మాజీ చైర్మన్, సాయి విశ్వనాథ అన్నపూర్ణ సేవా సమితి ఫౌండర్ వైస్ చైర్మన్ చిదర నాగేందర్ పెళ్లిరోజు వేడుకలు గడ్డి అన్నారంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గడ్డి అన్నారంలోని ప్రసిద్ధ శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయంలో చిదర నాగేందర్ దంపతులకు దేవాలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వక్కా లంక శ్రీనివాసరావు, దేవాలయ కమిటీ సభ్యులు కలిసి చిదర నాగేందర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో చిదర కుటుంబ సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు, స్నేహితులు, అభిమానులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# జనసేన పార్టీలో చేరిన యువ నాయకుడు ప్రేమ్ గాంధీ

## పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని వెల్లడి




హైదరాబాద్, 3 జూన్ (నగర నిజం) :ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక రాజకీయాల ప్రోత్సాహం, అవినీతి రహిత సమాజ నిర్మాణం, యువతకు రాజకీయాల్లో సముచిత ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యాలతో పనిచేస్తున్న జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై యువ నాయకుడు ప్రేమ్ గాంధీ జనసేన పార్టీలో చేరినట్లు ప్రకటించారు. పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంపై పూర్తి విశ్వాసంతో పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ఆశయాలు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించబడినవని, వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ సంస్థాగత బలోపేతానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, యువతను రాజకీయాల వైపు ప్రోత్సహించి జనసేన పార్టీలో భాగస్వామ్యం చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటానని వెల్లడించారు.అవినీతి వ్యతిరేక పోరాటాల్లో చురుకుగా పాల్గొంటూ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. బలహీన వర్గాల అభివృద్ధికి పార్టీ చేపట్టే కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి వారి సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.పార్టీ నిర్ణయాలు, కార్యక్రమాలను క్రమశిక్షణతో అమలు చేయడంతో పాటు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణలో జనసేనను బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు తన శక్తి సామర్థ్యాలను వినియోగిస్తానని చెప్పారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, నాయకత్వం అప్పగించే ప్రతి బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. పార్టీ ఆశయాల సాధన కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావడానికి కృషి చేస్తానని ప్రేమ్ గాంధీ తెలిపారు.

# మహబూబ్ నగర్ బస్టాండ్‌లో ఫ్యాన్లు ఆఫ్... అధికారులను నిలదీసిన

**ఉమ్మడి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎర్రమన్న బాలరాజు**




మహబూబ్ నగర్, జిల్లా నగర నిజం 3 జూన్:మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని బుధవారం నాడు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఫ్యాన్లు ఆఫ్‌లో ఉండటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మండుతున్న ఎండలు, ఉక్కపోత వాతావరణం మధ్య బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు చెమటలు పట్టే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పలు ఫ్యాన్లు ఆఫ్‌లో ఉండటాన్ని గమనించిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎర్రమను బాలరాజు అక్కడ ఉన్న అధికారులను ప్రశ్నించారు. వెంటనే స్పందించిన అధికారులు, సిబ్బందికి సూచనలు ఇవ్వడంతో ఆఫ్‌లో ఉన్న ఫ్యాన్లను ఆన్ చేశారు. దీంతో ప్రయాణికులు కొంత ఉపశమనం పొందారు.ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన ఆర్టీసీ అధికారులు ముందస్తుగా తనిఖీలు నిర్వహించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజూ వేలాది మంది రాకపోకలు సాగించే బస్టాండ్‌లో ఫ్యాన్లు, తాగునీరు, పరిశుభ్రత వంటి ప్రాథమిక సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

# చిన్న రావిరాలలో ఆర్వో వాటర్ ఫిల్టర్ ప్రారంభం




చిన్న రావిరాల, 3 జూన్ (నగర నిజం) : చిన్న రావిరాల గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ఫిల్టర్ ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ పాల్గొని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని తెలిపారు.సుమారు రెండు లక్షల రూపాయల వ్యయంతో ఆర్వో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసిన బి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డికి గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సదిపల్లి శిరీష శంకర్ రెడ్డి, వార్డు సభ్యులు బండారు అనిత,ఆకిటి రామకృష్ణారెడ్డి, నా రెడ్డి రిషిత సతీష్ రెడ్డి, రాపోలు మల్లేష్, బండారు సత్యనారాయణ, కళ్లెం శ్రీధర్ రెడ్డి, కళ్లెం ధర్మారెడ్డి పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌కు రాష్ట్ర కాంగ్రెస్ నేత సిద్ధేశ్వర్ అభినందనలు

**కర్ణాటకలో కొత్త శకం ప్రారంభమైందన్న తెలంగాణ పంచాయతీ రాజ్ అభియాన్ సంఘటన్ చైర్మన్ రాచమల్ల సిద్ధేశ్వర్**



రాజేంద్రనగర్, జూన్ 3(నగరనిజం ప్రతినిధి):కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డీకే శివకుమార్ కు తెలంగాణ పంచాయతీ రాజ్ అభియాన్ సంఘటన్ చైర్మన్ రాచమల్ల సిద్ధేశ్వర్ అభినందనలు తెలిపారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించడం కర్ణాటకలో కొత్త శకం ప్రారంభమైందని రాచమల్ల సిద్ధేశ్వర్ అభిప్రాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రంలో రాజకీయ దురందరుడిగా డీకే శివకుమార్ కు మంచి పేరు ఉందని సిద్ధేశ్వర్ పేర్కొన్నారు. ఒప్పందంలో భాగంగానే కాంగ్రెస్ అధిష్టానం సిద్ధరామయ్య స్థానంలో డీకే శివకుమార్ కు సీఎం పగ్గాలు అప్పగించిందని సిద్ధేశ్వర్ చెప్పారు. కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ఆధ్వర్యంలో ఆ రాష్ట్రం మరింత ప్రగతిని ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అదేవిధంగా డీకే శివకుమార్ కొత్త ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆయన సారథ్యంలో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని రాచమల్ల సిద్ధేశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు.కర్ణాటక ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డీకే శివకుమార్ కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

నగరనిజం



# ఘనంగా సీపీఐ రాష్ట్ర నేత పానుగంటి పర్వతాలు జన్మదిన వేడుకలు

**పానుగంటి పర్వతాలుకు శుభాకాంక్షలు తెలిపిన కమ్యూనిస్టు నేతలు**






రాజేంద్రనగర్, జూన్ 3(నగరనిజం ప్రతినిధి) సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లోని పార్టీ కార్యాలయం లో జరిగిన పానుగంటి పర్వతాలు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న పలువురు సీపీఐ నాయకులు ఆయన చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు జన్మదిన వేడుకల నేపథ్యంలో ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు రాచమల్ల యాదగిరి, పార్టీ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రా గిరి, పార్టీ రంగారెడ్డి జిల్లా సీనియర్ నేత వనంపల్లి జైపాల్ రెడ్డి, పార్టీ నాయకులు మామిళ్ళ ప్రవీణ్ కుమార్ గౌడ్, రవీందర్, శ్రీను, రాజు తదితర నేతలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన చేత కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపిన కమ్యూనిస్టు పార్టీ నేతలు.... శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు.పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడిగా సీపీఐ బలోపేతానికి పానుగంటి పర్వతాలు ఎంతగానో కృషి చేస్తున్నారని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ ప్రజా పోరాటాలు నిర్వహించడంలో పర్వతాలు ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తున్నారని ఆయన అభినందించారు. జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న పానుగంటి పర్వతాలు.... భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని పాలమాకుల జంగయ్య ఆకాంక్షించారు. మరోవైపు తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులకు కార్యకర్తలకు పానుగంటి పర్వతాలు కృతజ్ఞతలు చెప్పారు.

# బాసర ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించిన విద్యార్థిని తాడూరి అన్విత






రాయికల్ జూన్ 03 (నగర నిజం) జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్లో చదువుతున్న చింతలూరు గ్రామానికి చెందిన విద్యార్థిని తాడూరి అన్విత ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. గత శనివారం విడుదలైన ఎంపిక జాబితా లో ఆమెకు సీటు కేటాయించినట్లు సమాచారం కానీ వాళ్ల అమ్మగారి టెలిఫోన్ కు బాసర ట్రిపుల్ ఐటీ నుండి తాడూరి అన్విత సీటు సాధించినట్లు వచ్చిన సమాచార మెసేజ్ ను ఈ రోజే వారు చూసుకున్నట్లు సమాచారం. కుటుంబ నేపథ్యం అమ్మానాన్న నిరుపేద కుటుంబం, నాన్న కొన్ని రోజుల క్రితం చనిపోయినట్లు సమాచారం, అమ్మ కష్టపడి చదివిస్తుంది. ప్రభుత్వ విద్యాసంస్థలో చదువుకుంటూ కృషి, పట్టుదలతో ముందుకు సాగిన అన్విత ఈ విజయాన్ని సాధించింది. బాసర ట్రిపుల్ ఐటీ లో ప్రవేశం పొందడం ద్వారా ఉన్నత సాంకేతిక విద్యను అభ్యసించే అవకాశం ఆమెకు లభించింది. అన్విత సాధించిన విజయం పై కుటుంబ సభ్యులు, ప్రధానఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తాడూరి అన్విత ఆదర్శంగా నిలిచిందని పలువురు అభినందించారు.

# జిల్లాలో 85 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి

**180 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేత**

**69,685 రైతుల వద్ద నుంచి**

**3,40,078.200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా,**

**55,590 మంది రైతుల ఖాతాల్లోకి రూ. 597 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు**

**వారం రోజుల్లో అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి, కేంద్రాలను ముసి వేస్తాము**

**రైతు కష్టానికి భరోసా.. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి**

**కొనుగోలు కేంద్రాల నుంచి సమీక్షల వరకు కలెక్టర్ క్రియాశీల పర్యవేక్షణ**

**ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహణ**

**కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని వెంటవెంటనే గోదాములు, మిల్లులకు తరలింపు**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**





మెదక్ బ్యూరో :నగర నిజం :రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తూ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.ప్రతిరోజూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ, ధాన్యం కొనుగోళ్లు, రవాణా, మిల్లులకు తరలింపు, సమస్యలపై ఆరా తీస్తున్నారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిస్తున్నారు.మరోవైపు జిల్లాలోని వివిధ మండలాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శిస్తూ, రైతులతో మాట్లాడుతున్నారు. కాంటా ప్రక్రియ, తేమ శాతం పరీక్షలు, రికార్డుల నిర్వహణ, ధాన్యం నిల్వలు, రవాణా ఏర్పాట్లను పరిశీలిస్తూ, కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.ధాన్యం బస్తాలు కేంద్రాల్లో ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా వెంటనే మిల్లులకు తరలించాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన చోట అదనపు వాహనాలు, హమాలీలను అందుబాటులో ఉంచి కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటివరకు 69,685 మంది రైతుల వద్ద నుంచి 3,40,078,200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా,55,590 మంది రైతుల ఖాతాల్లోకి రూ. 597,09 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేశామన్నారు.కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేయడం జరిగిందని,ప్రతి మిల్లు, కేంద్రం వారీగా కొనుగోలు వివరాలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలు, అలాగే మిల్లుల వద్ద ఎంత అన్లోడింగ్ పెండింగ్ ఉంది అనే వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.ధాన్యం రవాణా, నిల్వ, లోడింగ్, అన్లోడింగ్, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఎటువంటి ఆలస్యం లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.జిల్లాలో ప్రస్తుతం 600 లారీలు, 50 డీసీఎంలు, 300 ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.గోదాములు, రైస్ మిల్లుల వద్ద నిలిచిపోయిన లారీలను వెంటనే అన్‌లోడ్ చేసి, తిరిగి కొనుగోలు కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.మిల్లులకు వచ్చే ధాన్యాన్ని మరింత మంది హమాలీలను పెట్టుకొని, త్వరగా దిగుమతి అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు.రవాణా, గోదాముల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కొనుగోలు కేంద్రాల పనితీరు పట్ల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, నిరంతరం పర్యవేక్షించాలనీ బుధవారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మేడ్చల్ -ముద్ఖేడ్ (221.06 కిలో మీటర్ల మధ్య ) రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులపై రైల్వే అధికారులతో ఆర్డీఓ సమీక్ష సమావేశం




మెదక్ బ్యూరో :నగర నిజం ఆర్డీఓ జయ చంద్రా రెడ్డి రైల్వే అధికారులు మరియు తహసీల్దార్లతో కలిసి మేడ్చల్ – ముద్ఖేడ్ రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, గతంలో ఈ ప్రాజెక్టు కోసం 2 ఎకరాల 6 గుంటల భూమి ఇచ్చామని భూ సేకరణ కూడా పూర్తయ్యిందని, ప్రస్తుతం అదనంగా 7 ఎకరాల భూమి అవసరమని రైల్వే శాఖ నుంచి రిక్విజిషన్ అందిందన్నారు. ఈ భూ సేకరణ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత తహసీల్దార్‌లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ఇప్పటికే రైల్వే డబ్లింగ్ పనులు ప్రారంభమయ్యాయని, ఈ ప్రాజెక్టు పూర్తయితే రైళ్ల వేగం పెరగడంతో పాటు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో రైల్వే కన్సల్టెంట్ రమేష్ తో పాటు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ,వార్డుల సభలను సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



మెదక్ బ్యూరో: నగర నిజం :ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు,.మున్సిపాలిటీలో గ్రామ, వార్డు సభలు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ కార్యాలయం నుండి రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ .. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలోని వార్డులలో నిర్వహించనున్న సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. సభలలో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి కుటుంబం మొక్కలు నాటేలా అవగాహన కల్పించాలని సూచించారు. రహదారుల చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి అవెన్యూ ప్లాంటేషన్ లో మొక్కలు నాటాలని తెలిపారు. మురుగుకాల్వలు పరిశుభ్రం చేయుట, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఇండ్ల నుండి వచ్చే మురుగునీరు రోడ్లపైకి వెళ్లకుండా కమ్యూనిటి, వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. గ్రామసభలలో మహిళల రక్షణ, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై అరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రానున్న వర్షాకాలంలో గ్రామాలలో పారిశుధ్యం, మురుగు కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, భారీ అకాల వర్షాల వల్ల వాగులు వంకలు పొంగితే తీసుకోవాల్సిన రక్షణ చర్యలు ప్రజలను తరలించేందుకు అవగహన కల్పించాలని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలని, రాష్ట్ర, కేంద్ర ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన బృందాలను, రెస్క్యూ బృందాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఎన్ లినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పంటల అవశేషాలు కాల్చొద్దని దాని వల్ల భూమిలో ఉన్న పోషకాలు చనిపోతాయని కలియదున్నడం వల్ల భూమికి బలం పెరుగుతుందని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ..పోలీస్ అధికారులు మండల, డివిజన్ స్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ, వార్డు సభలలో పోలీస్ అధికారులు పాల్గొనాలని ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు, పిడుగుల వల్ల తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. 10వ తేదీన జరుగనున్న ప్రతి గ్రామసభలో అరైవ్ ఎలైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రహదారి సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. 12వ తేదీన డ్రగ్స్ మహమ్మారిపై జరుగనున్న సభలలో ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారు. నకిలీ విత్తనాలు ఎరువులు విక్రయిస్తే పిడి యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు. సీజన్ కు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా, విద్యుత్, విద్య, ప్రణాళిక, తదితర శాఖల అధికారులతో పాటు అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో గీతా స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది

**తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరింపజేసిన సాంస్కృతిక కార్యక్రమం**

**చిన్నారులను అభినందించిన మంత్రి వివేక్ వెంకటస్వామి**

**ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేత.**



మెదక్ బ్యూరో : నగర నిజం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం నిర్వహించిన వేడుకల్లో గీతా స్కూల్ విద్యార్థులు తమ అద్భుతమైన నృత్య ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ సాగిన ఈ సాంస్కృతిక ప్రదర్శన వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వివేక్ వెంకటస్వామి విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ వారికి మెమెంటోలు అందజేశారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించిందని కొనియాడారు.ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ పి. రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి. ఉష, డైరెక్టర్లు భరత్, డాక్టర్ మౌనిక, రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్తా, ప్రిన్సిపాల్ అరుణ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్ విద్యార్థులను అభినందించి వారి విజయాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

